VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం A 139

అధికార భాషగా ఇంగ్లీషే ఉండాలట

బెంగాల్ విద్యామంత్రి ప్రకటన

కలకత్తా, మార్చి 17

భారతదేశంలో అధికారభాషగా ఇంగ్లీషునే కొనసాగించాలని పశ్చిమ బెంగాల్ విద్యామంత్రి రాయ్ హరేంద్రనాథ్ చౌదరీ నేడిక్కడ చెప్పారు.

విశాలాంధ్ర

705921

సంపుటి 6 * విజయవాడ మంగళవారం ఫాల్గుణం 27-1879 [మార్చి 18-1958] * సంచిక 346

నాటక, నాటిక పోటీలు

అమెచ్యూర్ నటీనటులకు మంచి అవకాశం!
బాపట్ల తాలూకా ఉప్పుటూరులో - ఏప్రిల్ 1 నుండి 5 వరకు
ఉత్తమ నాటిక, నాటకాలకు, ఉత్తమ నటనకు; ఉత్తమ హాస్య నటనకు ప్రత్యేక బహుమతులు ఇవ్వబడును.
ప్రవేశ రుసుం : రు. 5/- లు.
దరఖాస్తులు యీనెల 26 తేదీ నాటికి చేరాలి.
వి. నాగేశ్వరరావు,
నాటక నాటిక పోటీ సమితి, ఉప్పుటూరు P. O.,
వయా పరుచూరు, గుంటూరు జిల్లా.

మధ్య సుమత్రాలోని విద్రోహ ముఠాను మట్టుపెట్టి తీరుతాం

బాండుంగ్ బహిరంగసభలో ఇండొనేషియా అధ్యక్షుడు డాక్టర్ సోకర్నో ప్రకటన

తిరుగుబాటుదార్లకు విదేశీయుల మద్దత్తు వుందని వెల్లడి

సింగపూర్, మార్చి 16

ఇండొనేషియా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకొనడం కోసం రాష్ట్రాలపై గట్టి కేంద్రాధిపత్యం వుండటం చాలా అవసరమని అధ్యక్షుడు సోకర్నో బాండుంగ్‌లో జరిగిన ఒక బహిరంగసభలో చెప్పారు. ఇప్పుడు సుమత్రాలోని తిరుగుబాటు నాయకులు అవకాశవాదులేకాని నాయకులు కారని ఆయన అన్నారు.

డాక్టర్ సోకర్నో ఉపన్యాసాన్ని బాండుంగ్ రేడియో ప్రసారం చేసింది. తూర్పుజావా, సెలిబిస్ దీవులలో పర్యటిస్తూ ఆయన బాండుంగ్ వచ్చి ఉపన్యాసంచేశారు. ఇక్కడనుంచి ఆయన జకార్తాకు తిరిగి వెళ్లారు.

డాక్టర్ సోకర్నో బహిరంగ సభలో ఇలా ఉపన్యసించారు :

సుమత్రా స్వతంత్ర రాజ్యంగా మనజాలదు. ఇండొనేషియాలోని ఏ రాష్ట్రంకూడా ఒంటరిగా మనడం అసాధ్యం. ఆయారాష్ట్రాల ప్రజలు సుఖసంపదలను సాధించాలంటే రాష్ట్రాలన్నీ ఐక్యంగా వుండక తప్పదు.

సుమత్రా ఉత్తరపు కొసనున్న సబాంగ్ నుంచిపశ్చిమ ఇరియన్‌లోని మెరేకేవరకూ వ్యాపించిన ఈ విశాల రాజ్యాన్ని ఇండొనేషియా ప్రజలు కాపాడుకోవాలి.

మన కటువంటి రాజ్యం కేంద్ర ప్రభుత్వం వుండితీరాలి. మనం 1945 లో కుదుర్చుకొన్న ఒప్పందం ఇదే.

పశ్చిమ ఇరియన్ కూడా ఈ రాజ్యంలో అంతర్భాగం. ఇప్పుడు సుమత్రాలో ఏర్పడిన తిరుగుబాటు ప్రభుత్వం 1945 లో మనం చేసిన స్వాతంత్ర్య ప్రకటనకు పూర్తివిరుద్ధం.

మధ్య సుమత్రా తిరుగుబాటు దార్లనాయకులు స్వాతంత్ర్య పోరాటానికి వెన్నుపోటు పొడిచారు. కాబట్టి వారి పనిపట్టిద్దాం.

మనం సమైక్యతతో గట్టిగా నిలబడాలి.

ఒకదాన్ని ఒకటి బెదిరి[illegible]కొంటున్న రెండు ప్రపంచ కూటాల లోను మనం పడరాదు.

ఇండొనేషియా ప్రజలమైనమనకు కూటాలక్కరలేదు. అందరితోను స్నేహంగా వుండాలనేదే మన అభిమతం.

మన విదేశాంగవిధానం తటస్థ విధానంకాదు. అది ఏ కూటంలోను చేరరాదన్న విధానం. సామ్రాజ్యవాదులతో తప్ప మిగతావారందరితోను సహజీవనం నెరపాలనేది ఇండొనేషియా వాంఛితం.

ఇండొనేషియా సామ్రాజ్యవాదాన్ని నిరంతరం ప్రతిఘటిస్తుంది.

తిరుగుబాటుదార్ల నాయకులకు ప్రస్తుత ప్రభుత్వం మీద, దాని విధానాలమీద అసంతృప్తి వుంటే పార్లమెంటుద్వారా వారా అసంతృప్తిని ప్రకటించవచ్చును.

దీన్నే మనం ప్రజాతంత్రపద్ధతి అని పిలుస్తాం.

అలా చేయడానికి బదులు వారొక తుది హెచ్చరికను అందించి తిరుగుబాటు ప్రభుత్వాన్ని నెలకొల్పారు.

ఇండొనేషియా రిపబ్లిక్‌కు పునాదులు వేయడంకోసం ఆత్మత్యాగం చేసిన అమరవీరులపట్ల ఈ చర్య అపచారం

మధ్య సుమత్రా తిరుగుబాటు దార్లు అభ్యుదయ నిరోధకులు, విప్లవ విద్రోహులు.

ఈ తిరుగుబాటు జరిగినప్పటికీ ఇండొనేషియా పురోగమనం ఆగదు.

తిరుగుబాటు నాయకులంతా పచ్చి అవినీతి పరులు.

ఉత్తర సెలిబిస్ తిరుగుబాటు దార్లు అవకాశవాదులు. వారు దేశం నుంచి పెద్దమొత్తంలో ధనాన్ని దొంగచాటుగా రవాణా చేశారు.

వారికి ఏ కూటంతోను సంబంధం లేని మన విధానం నచ్చదు. ఇండొనేషియాను అధికార కూటాలలోకి ఈడ్వాలని వారి అభిమతం.

ఇండొనేషియాను ఈ కూటాలలోకి లాగాలని చూసే విదేశాలు డబ్బు ఇచ్చి మధ్య సుమత్రా తిరుగుబాటు దార్లను తమ ఏజంట్లుగా కుదుర్చుకొన్నాయి.

నేను విదేశాల్లో పర్యటించినప్పుడు లెఫ్టినెంట్ కర్నల్ వెంజె సుమువల్, జె. ఆరో, మెజర్‌జనపంలే విదేశీయుల ప్రభావంలో ఎంతలా చిక్కుకున్నారో ప్రత్యక్షంగా చూశాను.

(కర్నల్ సుమువల్ పదవీభ్రష్టుడైన ఉత్తర సెలిబిస్ సేనాని. కర్నల్ వాహా సైనాలోని ఇండొనేషియా రాయబారికి సైనిక సలహాదారుగా వుండేవారు. మేజర్ పాంలే కర్నల్ సుమువల్‌కు అంగరక్షకుడు.)

పదవీభ్రష్టుడైన కర్నల్ సుమువల్ జపానువారివద్ద ఆయుధాలు కొనడానికి బేరం కుదుర్చుకొన్నాడు.

ఇండొనేషియా రిపబ్లిక్‌పైకి దాడి చేయడంకోసమే ఈ ఆయుధాలను ఉపయోగించాలని సుమువల్ ఆశయం.

కాని ఈ ఆయుధాలబేరం పత్రంపై సంతకాలు జరిగేముందు ఒక ఘటన జరిగింది. వీటిని ఇండొనేషియాలోనే ఒకానొక ప్రదేశానికి కొనివచ్చి అప్పగిస్తే బాగుంటుందిగదా అని మరొక విదేశీ ఏజంటు సూచించాడు. దీనితో కర్నల్ సుమువల్ జపానువారితో చేసుకొన్న ఒప్పందాన్ని రద్దుచేసుకొన్నాడు.

మహాజనులారా! మీరే చెప్పండి. ఇది దురాక్రమణ కాదా? మీ సహాయం వుంటే ఈ ద్రోహులకు భూమిమీద తావులేకుండాచేయగలం.

డబ్బిచ్చి భూముల్ని బీడు పెట్టించే పథకం

అమెరికాలో అమలు

వాషింగ్టన్, మార్చి 16

అమెరికాలో ఆహార ధాన్యాల ఉత్పత్తి తెగ పెరిగిపోతూన్నదట. రాసులు పడిపోతూన్న గోధుమనూ, ధాన్యాన్నీ, పత్తినీ ఏమిచేయాలో ప్రభుత్వానికి తోచకుండా వున్నదట. దీనికి ప్రభుత్వం ఇప్పుడో "విప్లవాత్మక" మైన పరిష్కారమార్గాన్ని అమలుజరుప నిశ్చయించింది. అదేమిటంటే-భూమిని బీడు పెట్టడంకోసం రైతులకు కొంత డబ్బు చెల్లించడం. ప్రస్తుతానికి 20,213 ఎకరాల పంటభూమికి అయిదేళ్లు మొదలుకొని పదేళ్ళవరకు 'పింఛను' ఇవ్వ నిశ్చయించుకున్నారట. ఈవిధంగా ఉత్పత్తిని తగ్గించాలనీ, నిలవలు ఇంకా పేరుకుపోకుండా అరికట్టాలనీ ప్రభుత్వం నిశ్చయించుకుంది.

తమతమ భూముల్లో పంటలేమీ పండించకుండా ఉంటే రైతుకు యకరానికి పదకొండు డాలర్ల 57 సెంట్లు (సుమారు 55 రూపాయలు) ఇవ్వడానికి అమెరికా ప్రభుత్వ పూనుకుంది

వ్యవసాయ రంగంలో ఇదొక "విప్లవం" అని అమెరికా పాలకవర్గాలవారంటున్నారు.

మరొక నగరం ప్రభుత్వ సేనల వశం

జకార్తా, మార్చి 16

మధ్య సుమత్రలోని సియాక్ శ్రీ ఇంద్రపుర మొన్న 14 వ తేదీ సాయంత్రం కేంద్రప్రభుత్వ సేనల వశమయిందని జకార్తారేడియో తెలిపింది.

మధ్యసుమత్రలో ప్రభుత్వసేనలు ముట్టమొదట దిగిన సుంగాయి పాక్నింగ్ నగరానికీ, ప్రభుత్వ పు గాలిగుమ్మటం సేనలు ఇటీవల స్వాధీనం చేసుకున్న అమెరికన్ నూనెగని కేంద్రం పాకన్‌బారూ నగరానికీ మధ్యగా సియాక్ నదిఒడ్డున ఉంది. సియాక్ శ్రీ ఇంద్రపురనగరం.

ఆ ప్రాంతంలోని రహదారులన్నీ ప్రభుత్వసేనల చేతుల్లోనే ఉన్నాయనీ, నూనె రవాణా కూడా మామూలుగానే సాగుతున్నదనీ జకార్తా రేడియో తెలిపింది.

శిఖరాగ్రసమావేశానికిపశ్చిమ రాజ్యాల అంతరాయాలు

—టిటో ఖండన

బెల్గ్రేడ్, మార్చి 16

ప్రాక్పశ్చిమ శిఖరాగ్ర చర్చలు జరగకుండా పశ్చిమ రాజ్యాలవారు అంతరాయాలు కల్పిస్తున్నారని యుగోస్లావియా అధ్యక్షుడు టిటో నేడు విమర్శించారు.

బెల్గ్రేడ్‌లో లక్షమంది హాజరైన ఒక బహిరం[illegible]ఆయన ప్రసంగిస్తూ సోవియ[illegible]ం వాస్తవ దృష్టితో చేసిన నిర్మాణాత్మక ప్రతిపాదనలు చూసి తనకు చాలా సంతోషం కలిగిందని చెప్పారు. కాని వాటిపై పశ్చిమ రాజ్యలవారి వైఖరి చూసి తనకు విషాదం కలుగుతోందన్నారు.

ఇప్పుడు శిఖరాగ్రసమావేశం జరగకుండా అంతరాయాలు కలిగించడం కోసం పశ్చిమరాజ్యాలవారు రకరకాల ఎదురు ప్రతిపాదనలు చేస్తున్నారు.

శిఖరాగ్ర సమావేశానికి ముందు విదేశాంగ మంత్రులసభ జరిపి చర్చనీయాంశాలను నిర్ణయించాలంటూపశ్చిమ రాజ్యాలవారు ప్రతిపాదించారు. దీనికి సోవియట్ ప్రభుత్వం సమ్మతించింది.

ఇప్పుడు పశ్చిమరాజ్యాలవారు ఆవిదేశాంగమంత్రుల సభకు కొత్త షరతులు పెట్టారు. విదేశాంగ మంత్రులు ఆ యా సమస్యల సారాంశంపై చర్చలు జరపాలనేది అవసరతు.

ఈ సభలో ప్రాతినిధ్యం 3-1 నిష్పత్తిలో వుండాలని వారు కోరుతున్నారు. దీనివల్ల సత్ఫలితాలు కలగవు. ఇలాగ వారు శిఖరాగ్ర సమావేశాన్ని ఏదో ఒక విధంగా అడ్డుకొట్టడానికి అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు.

శిఖరాగ్ర సమావేశ సమస్య నేడు ప్రజలందరి హృదయాల్లో నూ హత్తుకొనిపోయింది. కనుక శిఖరాగ్ర సమావేశానికి అంతరాయం కల్పించే వారిని రచ్చకీడ్చి తీరుతారు.

తమకేం కావాలో ముందుకువచ్చి బహిరంగంగా చెప్పడమంటే పశ్చిమ దేశాలవారికి భయంగావుంది. ప్రచ్ఛన్నయుద్ధం కావాలా అక్కరలేదా? అణ్వాయుధ పాటవ పరీక్షలు ఆపుచేయలా కొనసాగించాలా? ఇందులో తమకేదికావలో బాహాటంగా చెప్పలేకపోతున్నారువారు.

శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనే హక్కు యుగోస్లావియా కుంది.

అలాంటి సమావేశంలో ఏ కూటానికీ చెందని దేశాలు పాల్గొనడంవల్ల నిర్మాణాత్మక ప్రతిపాదనలను చేయడానికి వీలవుతుందని మన నమ్మకం.

మమ్మల్ని ఆహ్వానించండి అని ప్రాధేయపడం. బహుశా మనలను ఆహ్వానించక పోవచ్చును. అయినప్పటికీ శిఖరాగ్ర సమావేశానికి మనం స్వాగతం ఇస్తాం. అయితే ఈ శిఖరాగ్ర సమావేశం ఎట్టిదో అప్పుడు మన కర్థం అయిపోతుంది. దాన్ని బట్టి మనం ఒక నిర్ణయానికి రాగలుగుతాం అని టిటో చెప్పారు.

అమరావతీస్థూప శిల్పానికి స్టోయికా జేజేలు

మద్రాసు, మార్చి 16

"ఈపురావస్తుశాలనుచూచినప్పుడు అక్కడి ప్రాచీన శిల్పఖండాలు వాటి శిల్ప నైపుణ్యం నన్ను ప్రత్యేకంగా ముగ్ధుడిని చేశాయి. ఉదాహరణకు అమరావతీ స్థూపశిల్పం నన్ను 'పరవశుడిని చేసింది. కృష్ణ, శివ ప్రతిమలు నన్నాకర్షించాయి" అని రుమేనియా ప్రధాని స్టోయికా ఈవేళ మద్రాసులోని పురావస్తుశాలను సందర్శించిన తరువాత అన్నారు.

ఆయనకు, ఉప ప్రధాని ఎమిలి బొండరాస్‌లకు ఈవేళ ఈ పురావస్తు శాలనూ, చిత్రకళ ప్రదర్శనశాలను చూపించారు.

పురావస్తుశాలలో బ్రిటిష్ వారి 'మాగ్నాకార్టా' (రాజు నిరంకుశాధికారాలను బాగా పరిమితం చేస్తూ క్రాంవెల్ రూపొందించిన పత్రం) ప్రతి ఒకటి చారిత్రక విభాగంలో ఉండడం చూచి, "భారత చరిత్రకూ దీనికీ సంబంధం ఏమిట"ని వారన్నారు.

కేరళ విద్యాబిల్లులో రాజ్యాంగ విరుద్ధ అంశాలు కొన్నికలవట:

లోక్‌సభలో శ్రీ పంత్ ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 17

కేరళ విద్యా బిల్లులోని కొన్ని అంశాలు రాజ్యాంగానికి విరుద్ధంగా వున్నవని కేంద్ర న్యాయమంత్రి, అటార్నీ జనరల్ అభిప్రాయపడినందున ఆ బిల్లును సుప్రీంకోర్టుకు నివేదించబోతున్నామని కేంద్ర హోం మంత్రి శ్రీ పంత్ నేడు సభలో ప్రకటించారు.

ఈ బిల్లుపై ఆమోదముద్ర వేయకుండా నిలుపుచేసే అధికారం రాష్ట్రపతికి వున్నప్పటికీ, సుప్రీంకోర్టు సలహా తీసుకొని, తుదినిర్ణయం చేయటం మంచిదని భావించామని ఆయన చెప్పారు.

శ్రీ వాసుదేవన్ నాయర్ మున్నగు పదిమందిసభ్యులు కలిసివేసిన ప్రశ్నకు సమాధానమిచ్చిన సందర్భంలో శ్రీ పంత్ పైవిషయం తెలిపారు.

కేరళ విద్యాబిల్లును పోలిన ఆంధ్ర విద్యాబిల్లును సుప్రీంకోర్టుకునివేదించకుండా రాష్ట్రపతి ఆమోదముద్ర వేసినప్పుడు కేరళబిల్లు విషయంలోఈవిచక్షణ యెందుకని స్వతంత్ర సభ్యుడు శ్రీ ఈశ్వరయ్యర్ ప్రశ్నించగా, శ్రీ పంత్ ఇలా సమాధానమిచ్చారు:

"ఆంధ్ర బిల్లు లాంటిదేనని నాకు తెలియదు. అది ఈ బిల్లులాంటిది కాకపోవచ్చు."

శ్రీ వి. పి. నాయర్ : కేంద్ర విద్యామంత్రిత్వశాఖవారు సూచించిన మార్పులన్నింటినీ విద్యాబిల్లులో పొందుపర్చారుగదా ?

పంత్ : కేంద్రం సూచించిన కొన్ని అంశాలను ఈ బిల్లులో పొందుపర్చలేదు.

ఆరబ్ విముక్తి ఉద్యమానికి ఐక్య రిపబ్లిక్ అండదండలు

— శ్రీ నాజర్

డమాస్కస్, మార్చి 16

"ఈజిప్టు - సిరియాలతో ఏర్పడ్డ ఆరబ్ రిపబ్లిక్ - సామ్రాజ్యవాదం నుండి, విదేశీ గుత్తాధిపత్యంనుండి, విదేశీ జోక్యంనుండి యావత్తు ఆరబ్ ప్రపంచాన్ని విముక్తిచేసేందుకై ఉద్యమించిన ఆరబ్ విముక్తి ఉద్యమానికి పెద్ద సహాయకారిగా ఉండగలదు" అని ఈజిప్టు అధ్యక్షుడు శ్రీ నాజర్ అన్నారు. ఈయన ఈ విషయాన్ని ప్రస్తుతం ఉత్తర సిరియాలోని అలెప్పోని సందర్శిస్తున్న సందర్భంలో ప్రకటించారు.

జూన్ 27 లోగా కోర్కెలు తీరకపోతే సమ్మె

ప్రభుత్వ శాఖలలో పనిచేసే 50 వేల మంది కార్మికుల నిర్ణయం

['విశాలాంధ్ర' విలేఖరి]

హైద్రాబాదు, మార్చి 16

ఆంధ్రప్రభుత్వ పి. డబ్ల్యు. డి., విద్యుచ్ఛక్తి, వాటర్ వర్క్సు నగరా శాఖల్లో పనిచేసే 50 వేలమంది కార్మికుల కోర్కెలను జూన్ 27 తేదీ లోపుగా ప్రభుత్వం తీర్చకపోతే ఆనాటినుంచి నిరవధికంగా సమ్మెచేయాలని నేడు ఆ కార్మిక సంఘాల ప్రతినిధులు సమావేశమై నిర్ణయించారు.

హింద్ మజ్దూరుసభ, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసులకు అనుబంధించిన మొత్తం 22 కార్మిక సంఘాలకు చెందిన 90 మంది ప్రతినిధులు నేడు సమావేశమై ఈ నిర్ణయం చేశారు.

ప్రభుత్వంతో రాయబారాలు జరపడానికి, రాయబారాలు విఫలమైతే సమ్మెను నడిపించడానికి ఒక కార్యాచరణ సంఘాన్ని కూడా నియమించారు. ఈ కార్యాచరణ సంఘములో శ్రీ మహాదేవ్ సింగ్, కె. ఎల్. నరసింహం, సత్యనారాయణరెడ్డి, గోవింద్‌సింగ్ మున్నగువారున్నారు.

నేటి సమావేశానికి శ్రీ మహాదేవ్ సింగ్ అధ్యక్షత వహించారు.

ఆంధ్ర ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ మఖ్దూం మొహియుద్దీన్ ప్రసంగిస్తూ హింద్ మజ్దూరు సభ, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కలిసి పనిచేస్తున్నందుకు హర్షం వెలిబుచ్చారు. భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసువారు కలిసిరానందుకు ఆయన విచారం వెలిబుచ్చారు.

శ్రీ సత్యనారాయణ రెడ్డిగారు ప్రసంగిస్తూ ఎన్. జి. వోలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రత్యక్ష చర్యకోసం సిద్ధంగావున్నారని చెప్పారు.

* * *

రాజ్యసభ సభ్యుడైన రామేశ్వర్ అగ్నిభోజ్‌ను మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కార్యవర్గం పార్టీ సభ్యత్వం నుండి తొలగించింది.

సోకర్నో సమక్షంలో లక్షమంది ప్రదర్శన

కేంద్ర ప్రభుత్వ విధానాలకూ, తిరుగుబాటు దారులపై దాడికి సంపూర్ణ ఆమోదం

జకార్తా, మార్చి 16

ఒక లక్షమంది విద్యార్థులు, కార్మికులు, రైతులు మాజీసైనికులు తదితర పౌరులు ఈవేళ సోకర్నో ఎదుట గొప్ప ప్రదర్శనం చేశారు. ఆరుగురు చొప్పునబారులుతీరి ఆగ్నేయాసియా కూటమికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలతో బ్యానర్లు పట్టుకొని ముందుకు సాగిపోయారు. సుమత్రా తిరుగుబాటుదారులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సైనిక చర్యలకు తమ అండదండల్ని తెల్పుతూ వీరు ఎలుగెత్తి నినాదాలిచ్చారు.

ఈ ప్రదర్శనలో ప్రస్తుతం తిరుగుబాటు జరుగుతూ వున్న మధ్య సుమత్రానుంచి వచ్చిన ప్రతినిధివర్గం కూడావుంది. సోకర్నో వారికి ప్రత్యేక అభివాదం తెల్పారు.

ఈ ప్రదర్శనలో ఇండొనేషియా జాతీయ పతాకంతోపాటు ఇండొనేషియా కమ్యూనిస్టుపార్టీ పతాకం కూడా ప్రముఖంగా కన్పించింది.

తన భవనం వెలుపల నున్న ప్రజాసమూహాన్ని ఉద్దేశించి అధ్యక్షుడు శ్రీ సోకర్నో యిలా అన్నారు : "1945 నాటి ఇండొనేషియా స్వాతంత్ర్య ప్రకటనకు సుమత్రా తిరుగుబాటు "ద్రోహం" తలపెట్టింది."

శ్రీ సోకర్నో యింకా యిలా అన్నారు :

"పడాంగ్ తిరుగుబాటుదార్లు జాతీయైక్యతను చిన్నాభిన్నం చేస్తున్నారు. అందుచేతనే ప్రజలంతా కలిసి స్వాతంత్ర్య ప్రకటనని రక్షించి, తిరుగుబాటుకి స్వస్తి చెప్పేందుకై గట్టి చర్యలు తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను."

అంతకుముందు బాండుంగ్ నుంచి డాక్టర్ సోకర్నో ఇక్కడకుతిరిగివచ్చిన రెండుగంటలలోపునే బ్రహ్మాండమైన బహిరంగసభ జరిగింది.

మధ్యసుమత్రాలోని విద్రోహులను మట్టుపెట్టడంకోసం సైనిక సమీకరణ చేయవలసిందని నేడు వేలాది యువకులు, గత యుద్ధాల్లో కాకలుతేరిన సిపాయీలూ అధ్యక్షుడు సోకర్నోని అభ్యర్థించారు.

ఇండొనేషియా స్వాతంత్ర్యానికి విద్రోహం తలపెట్టిన మధ్యసుమత్రా తిరుగుబాటుదార్ల చర్యను నిశితంగా ఖండిస్తూ ఆ సభలో తీర్మానాలు చేశారు.

ఇండొనేషియా అంతరంగ వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని అన్ని విధాలా ప్రతిఘుంచవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ వక్తలు ప్రసంగించారు.

శిఖరాగ్ర చర్చలకు అమెరికా అడ్డు

హాంకాంగ్, మార్చి 17

ఇటీవల రష్యా చేసిన శాంతి సూచనల్ని చైనా నేడు బలపర్చింది. శిఖరాగ్ర సమావేశానికి అడ్డుతగులుతూన్న అమెరికా ప్రభుత్వాన్ని నిందించింది.

"రష్యా శాంతిసూచనలు చేయడం ద్వారా, అమెరికామీద దాడిచేసే వుద్దేశం తనకు లేదని రష్యా "సుస్పష్టం" చేసింది అని పీపుల్స్ డైలీ చెప్పినట్లు నవచైనా వార్తాసంస్థ భోగట్టా.

విశ్వాంతరాళంమీద ఆధిపత్యాన్ని అమెరికా కోరడానికి కారణం - అమెరికాకు ఖండాంతర మిసిలీలు లేక పోవడమేననికూడా ఆ పత్రిక వ్రాసింది.

ఎండ వేడిమితో నడిచే రేడియో

రష్యాలో ఆవిష్కరణ

మాస్కో, మార్చి 16

ఎండ వేడిమితో పనిచేసే ఒక రేడియోను సోవియట్ శాస్త్రజ్ఞులు నిర్మించినట్లు మాస్కో రేడియో ప్రకటించింది. ప్రత్యేకరకం బ్యాటరీలు ఎండ వేడిమిని విద్యుచ్ఛక్తిగా మార్చి రేడియోకి అందిస్తాయి.

రాధాకృష్ణ

లండన్‌నుండి అమెరికాకు

లండన్, మార్చి 17

భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ గతరాత్రి లండనునుండి విమానంలో అమెరికాకు బయలుదేరారు. విమానంలో ఒక భాగాన్ని సరిచేయడం కొంత ఆలస్యమయినందున వీరి విమానం 40 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది.

గోదావరి డెల్టాలో రెండవ పంటకు నీటి కొరత

రైతుల ఆందోళన

అమలాపురం, మార్చి 16

గోదావరి కాలవల్లో నీరు తగినంతగాలేనందున సెంట్రల్ డెల్టాలో వేలాది ఎకరాల వరిపైరు రెండవపంట నష్టపడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని అమలాపురం తాలూకా రైతుసంఘ కార్యదర్శిగా శ్రీ చింతపల్లి కృష్ణమూర్తిగారొక ప్రకటన చేశారు.

వారా ప్రకటనలో ఇలా అన్నారు: "గోదావరినదిలో నీరు నిరుటి సంవత్సరం ఉన్నట్లుగానే ఉంది. కాని కాలవల్లో మాత్రం నీరులేదు. రెండవపంటకు నీరు అందటంలేదు. ఈ విషయం బొబ్బర్లంకలోని అధికారులదృష్టికి తీసుకువచ్చాము. కనుక అధికారులు సత్వరమే కాలవలలో తగినంత నీరువదలి రెండవపంట నష్టపడకుండా చూడాలి."

* * *

మద్రాసు రాష్ట్రంలో, మెట్టూరు ప్రాజెక్టు పథకంక్రింద 2 లక్షల 43 వేల ఎకరాలు మాత్రమే సాగు అయిందని మంత్రి కక్కన్ శాసనసభలో తెలియచేశారు.

భారతదేశానికి అమెరికా ఆర్థిక సహాయం

అమెరికాకే లాభకరమని షెర్మన్ కూపర్

న్యూయార్క్, మార్చి 16

అమెరికా భారతదేశానికి ఎక్కువగా ఆర్థిక సహాయం చేసినట్లయితే ఆర్థిక రాజకీయ రంగాల్లో ఇప్పటి సోవియట్ సవాలును అమెరికా ఎదుర్కోగలుగుతుంది అని భారతదేశంలోని మాజీ రాయబారి షెర్మన్ కూపర్ "న్యూయార్క్ టైమ్సు" పత్రికలో నేడొక వ్యాసం వ్రాస్తూ తెలిపారు.

అమెరికా నుండి అప్పులు విరివిగా లభించగలవనే హామీ భారతదేశానికి ఇవ్వాలన్నారు.

* * *

వ్యవసాయ కళాశాలల్లో స్త్రీలు ఎక్కువ సంఖ్యలో చేరాలని మద్రాస్ మంత్రి భక్తవత్సలం కోయంబత్తూరులో ఒక సభలో ప్రసంగిస్తూ అన్నారు.

హేవిళంబి నామ సంవత్సర
చాంద్రమాన ఫాల్గుణమాసం
బహుళ త్రయోదశి 10-32
శతభిషం - రాత్రిపగలు

విశాలాంధ్ర

మంగళవారం 18-3-58
ఫాల్గుణం 27-1879

ఇండొనేషియా

ఇండొనేషియా దేశంలో అంతర్భాగమైన మధ్యసుమత్రాలో విద్రోహచర్యలు సాగిస్తున్న తిరుగుబాటు దారులపై కేంద్రప్రభుత్వ సేనలు దాడిచేసి కీలకమైన పాకన్‌బర్హు విమానాశ్రయాన్ని, నూనెగనులు గల డుమాయ్ ప్రాంతాన్ని వశపరచుకున్నాయి. మధ్యసుమత్రాలోని తూర్పుతీరమంతా కేంద్రప్రభుత్వ వశమైనట్లు తెలుస్తున్నది.

అధ్యక్షులు సోకర్నో ఆరు రోజులపాటు జావా, బలి, దక్షిణ సెలిబిస్ దీవులలో పర్యటించి, విద్రోహులను అణచివేయవలసిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. బాండుంగ్ నగరంలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో మాట్లాడుతూ విద్రోహ ముఠాను కేంద్రప్రభుత్వం పూర్తిగా అణచివేస్తుందని ఉద్ఘాటించారు. ఇండొనేషియా ప్రజలు, జాతీయ స్వాతంత్ర్యం కొరకు పోరాడుతున్న కాలంలో ఈ తిరుగుబాటుదారు లందరూ స్వాతంత్ర్యోద్యమానికి వెన్నుపోటు పొడిచిన అవినీతి పరులనీ ఇట్టి వారిని ఐకమత్యంగా ఎదిరించాలనీ స్పష్టంచేశారు. ఇండొనేషియా ప్రభుత్వం విదేశాంగ విధానంలో పాటిస్తున్న శాంతియుత సహజీవన సూత్రాలను కూలద్రోసి, దేశాన్ని యుద్ధకూటములలోకి ఈడ్వటమే విద్రోహుల లక్ష్యమని, కొన్ని విదేశశక్తులు విద్రోహులకు సాయపడుతున్నాయని తేటతెల్లం చేశారు.

సోకర్నో అధ్యక్షుని పర్యటన ఫలితంగా ఇండొనేషియా ప్రజలలో స్వాతంత్ర్య పరిరక్షణ దీక్ష పెల్లుబుకుతున్నది. వేలాది యువకులు, మాజీసైనికులు, సైన్య సమీకరణకు పిలుపునివ్వవలసిందిగా సోకర్నో అధ్యక్షుని అభ్యర్థించారు. విద్రోహులపై జరిగే పోరాటంలో తామందరము పాల్గొనగలమని తెలియజేశారు. ఇండొనేషియా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి - ఐదిత్ ఒక ప్రకటనలో, కేంద్ర ప్రభుత్వ చర్యలను తన పార్టీ పూర్తిగాబలపరుస్తున్నదన్నారు. సత్వరమే, తిరుగుబాటు దారులపై శక్తివంతమైన సైనికచర్యలు జరిపి, కుట్రదారుల చర్యలు అంతర్యుద్ధానికి త్రోవతీయకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించాలన్నారు.

మధ్య సుమత్రాలో తిరుగుబాటు లేవదీసిన శక్తులు అమెరికా ప్రోత్సాహంతోనే తిరుగుబాటుచేశాయని ఇటీవలి ఘటనలుస్పష్టం చేశాయి. ప్రధాని జువాండా ఒక ప్రకటన చేస్తూ మధ్య సుమత్రాలోని తిరుగుబాటు దారులకు అమెరికా ఆయుధాలు విమానాలద్వారా అందుతున్నాయని వెల్లడిచేశారు. ఆస్ట్రేలియా విమానం ఒకటి మధ్య సుమత్రాలో ఆయుధాలను పడవేసినట్లు ఒక పత్రిక వెల్లడించింది. అమెరికా పౌరులను తరలించాలనే మిషతో అమెరికా యుద్ధనౌకలు సుమత్రా తీరంలో వేచిఉన్నాయి.

మధ్యసుమత్రా తిరుగుబాటు ఫలితంగా ఇండొనేషియాకు ఎంతటి తీవ్రపరిస్థితి ఏర్పడిందో పై విషయాలు తెలియజేయగలవు. ఆసియాదేశాల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను హరించాలని, ఏలైన చోట్ల తమకు అనుకూలంగా ఉండే కీలుబొమ్మ ప్రభుత్వాలను స్థాపించాలని అమెరికన్ సామ్రాజ్యవాదులు యత్నిస్తున్నారు. ఇండొనేషియా తిరుగుబాటుదారులను, గుర్తించే విషయమైకూడా అమెరికా ఆలోచిస్తున్నదని డల్లెస్ చేసిన ప్రకటనకు ఇదే అర్థం.

అయితే ఈ తిరుగుబాటు ఎంతకాలం నిలదొక్కుకోగలదా అని అమెరికన్ సామ్రాజ్యవాదులు పొంచి చూస్తున్నారు. ఇండొనేషియాలోని మితవాద శక్తుల ప్రాబల్యానికి, ఈ తిరుగుబాటు నాందీవాచకం కాగలదని వారు ఆశించారు.

కాని తిరుగుబాటు దారుల పట్ల రాజీనైఖరి అవలంబించాలని మితవాద నాయకుడు హట్టా చేసిన సూచనను సోకర్నో అధ్యక్షులు త్రోసిపుచ్చటంతో, సామ్రాజ్యవాదుల పన్నాగాలు కొంత దెబ్బతిన్నాయి. కాని వారు తమ ఆశలను పూర్తిగా వదులుకోలేరు.

కనుక ప్రస్తుతం మధ్యసుమత్రాలో రేగుతున్న కల్లోలాలను సాధ్యమైనంత త్వరలో అణచివేసి, ఇండొనేషియా ప్రభుత్వం, సర్వం సహాధికారాన్ని బలపరుచుకొని, దేశైక్యతను కాపాడగలుగుతుందని ఆశించుతున్నాం.

జాతీయైక్యతను స్వాతంత్ర్యాన్ని కాపాడుకునేందుకు సోకర్నో అధ్యక్షుడు తీసుకొనే అన్నిచర్యలకు, భారత ప్రజలు తమ సహాయ సానుభూతులు నందజేస్తారు.

కమ్యూనిస్టులతో బర్మా ప్రభుత్వ చర్చలు

త్వరలోసంభవమని వార్తలు

రంగూన్, మార్చి 15

బర్మాప్రభుత్వ ప్రతినిధులు, కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధులతో త్వరలో సమావేశం జరుపుతారని రంగూన్ డైలీపత్రిక ప్రకటించింది. ఆ పత్రిక ఈ క్రింది వివరాలనుకూడా వెల్లడించింది.

(ఈ వార్తను క్లుప్తంగా ఇదివరకే ఇచ్చాం. సం.)

ఉభయ పక్షాలకు చెందిన అధికార ప్రతినిధివర్గాలు, నాలుగైదు రోజులలో సమావేశమై అంతర్యుద్ధ విరమణపై సంప్రతింపులు జరుపుతారు. ఇటీవలనే కమ్యూనిస్టు నాయకుడు థాకిన్ థాన్‌తూన్ వద్దనుండి ఇద్దరు ప్రతినిధులు వచ్చి ప్రధాని యూనూను కలుసుకున్నారు. ఈ ప్రతినిధులు, ప్రధానితో మాత్రమే కాక ప్రభుత్వపార్టీయైన ఫాసిస్టు వ్యతిరేక సంఘటన నాయకులతో కూడా విడిగా చర్చలు జరిపారు. వీరి శాంతి ప్రతిపాదనలోని ముఖ్యాంశాలను, ఫాసిస్టు వ్యతిరేక సంఘటన కార్యవర్గం ఆమోదించింది.

'న్యూ లైట్ ఆఫ్ బర్మా,' అను బర్మా పత్రిక మరొక వార్త ప్రకటిస్తూ, మార్చి 28న అంతర్యుద్ధం పదవ వార్షికోత్సవంనాడు, యుద్ధ విరమణ జరగాలనీ, కమ్యూనిస్టు నాయకుడు థాన్‌తూన్ ప్రధాని యూనూకు వ్రాసినట్లు వెల్లడిచేసింది. థాన్‌తూన్ లేఖలో ఈ క్రింది అంశాలు కూడా వున్నాయి.

1. ఉభయపక్షాలు గతంలో జరిపిన సైనికచర్యల ఫలితా లన్నిటినీ విస్మరించాలి.
2. విప్లవకారులపై ఎట్టి ప్రతీకార చర్యలు తీసుకోరాదు.
3. నిర్బంధ చట్టాలన్నింటినీ రద్దుచేసి రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి.
4. కమ్యూనిస్టుపార్టీ, తదితర నిషిద్ధ పార్టీల నన్నిటినీ ప్రభుత్వం గుర్తించాలి.

ఈ షరతులను ప్రభుత్వం అంగీకరిస్తే మార్చి 27 న చర్చలు ప్రారంభించడానికి కమ్యూనిస్టుపార్టీ తన ప్రతినిధులను పంపుతుందని థాన్‌తూన్ తెలియజేశారు.

[illegible] విధ్వంసం లేని సైనిక బలగాన్ని పెంచుకున్నదని ఫ్రెంచి ప్రధాని చేసిన ఆరోపణను [illegible] ప్రభుత్వం ఖండించింది.

ఆసియా దేశాల పారిశ్రామికాభివృద్ధి

—ప్రావ్దాపత్రిక వ్యాఖ్య

మాస్కో, మార్చి 16

ఆసియాదేశాల్లో పారిశ్రామికాభివృద్ధిస్థాయి ప్రస్తుతం పశ్చిమదేశాల అభివృద్ధిస్థాయికన్నా అధికంగావుంది. భారత, బర్మా, లంక, ఇండొనేషియా ఆఫ్ఘనిస్తాన్ మొదలయిన దేశాలు తమ తమ జాతీయ ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో అఖండవిజయం సాధించాయి.

అవి ఏ సైనిక కూటమిలోనూ చేరకుండా అన్ని దేశాలపట్ల శాంతియుత సహజీవన సహకార విధానాన్ని అనుసరిస్తూ, తమ తమ జాతీయ ఆర్థిక వ్యవస్థలను రూపొందించుకొని పటిష్ఠం చేసుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. అని ఇటీవల జరిగిన ఆసియా ఆర్థిక ఉపసంఘ సమావేశానికి వెళ్లిన 'ప్రావ్దా' విలేఖరి మాయెవ్‌స్కీ ఆ పత్రికలో రాశారు.

ఆసియా ఆర్థికపరిస్థితిని గురించి ఉపసంఘ కార్యవర్గం తయారుచేసిన నివేదికనుగురించి వ్యాఖ్యానిస్తూ విలేఖరి ఇంకా ఈ దిగువ విషయాలు తెలిపారు.

ఆసియా దేశాలమధ్య సవ్యమైన ఆర్థిక సహకారం పెంపొందవలసిన అవసరాన్ని ఆర్థిక ఉపసంఘ ప్రస్తుత సమావేశంలో మునుపటికన్నా బాగా గుర్తించారు.

వర్తకం విషయంలో వివక్షతనూ, బడుగుదేశాలపై ఆర్థిక వొత్తిళ్లనూ సమావేశంలో అనేక దేశాల ప్రతినిధులు ఖండించారు.

అయితే ఉపసంఘ సభ్యులయిన దేశాలకూ, ఆసియాలోని సోషలిస్టు దేశాలకు మధ్య ఆర్థిక సంబంధాలు పెంపొందడాన్నే కాకుండా, సవ్యమైన ఆర్థిక సహకారాన్నే మొత్తంగా వ్యతిరేకించే దేశాలుకూడా లేకపోలేదు.

ఆసియాలో వలస ఆర్థికవ్యవస్థను ఇంకా నిలపెట్టాలనే ఆదుర్దాకొద్దీ పశ్చిమరాజ్యాలు ఈ దేశాల ఆర్థికాభివృద్ధిని అరికట్టడానికి ప్రయత్నిస్తున్నాయి.

భారతదేశానికి హోలెండ్ స్కాలర్ షిప్పులు

న్యూఢిల్లీ, మార్చి 16

1958-'59 సంవత్సరంలోహోలెండులోని కుటీర పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలకు జానపద కళాఖండాలను అన్వయింప చేయడంలో తర్ఫీదు నిచ్చేందుకై హోలెండ్ ప్రభుత్వం భారతదేశానికి రెండు స్కాలర్‌షిప్పులను యిచ్చిందని భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ చేసిన పత్రికా ప్రకటనలో వుంది.

ఒక్కొ విద్యా సంవత్సరానికి సరిపడా ఒక్కొక్క స్కాలర్‌షిప్పు విలువ వ్యక్తి ఒక్కింటికి రు. 240 లు. భోజనం ఉచితం; రెండవతరగతి టిక్కెట్టుతో రానూ పోనూ సముద్ర ప్రయాణం.

ఈ రెండు స్కాలర్‌షిప్పులలోను ఒకదానికిమాత్రం—అభ్యర్థి కనీసం ఒక మంచి డిగ్రీగాని, లేదా చిత్రకళల్లో అందుకు సమానమైన డిప్లమాగాని పొందాలి. దీనితోపాటు ప్రభుత్వం గుర్తించిన విద్యాసంస్థలనుండి ఆయా అభ్యర్థులు డిప్లమా లేక డిగ్రీగాని తీసుకున్నతర్వాత కనీసం రెండు సంవత్సరాలపాటు చిత్రకళల్లో ప్రత్యక్షానుభవం కలవారై యుండాలి.

కమ్యూనిస్టేతర పార్టీలవారి శపథం

పెకింగ్, మార్చి 16

"మా రాజకీయ దృక్పథాన్ని మార్చుకొని, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన సోషలిస్టుమార్గాన్ని అనుసరిస్తాము" అని వివిధ ప్రజాస్వామిక పార్టీలకు చెందినవారొక నాలుగు వేలమంది పెకింగ్‌చౌకులో నేడు సమావేశమై శపథం చేశారు.

చైనా జాతీయశాసనసభ స్థాయీ సంఘ ఉపాధ్యక్షులు ఒకరూ, విజ్ఞాన శాస్త్ర పరిషత్ అధ్యక్షుడూ, చైనా శాంతిసమితి అధ్యక్షుడూ అయిన కుమోజో ఈ సభలో పాల్గొని వీరందరూ తమను సంస్కరించుకొని బూర్జువాల నుండి శ్రమజీవులుగా మారాలనీ ఉద్బోధించారు. కుమోజో కమ్యూనిస్టుపార్టీ సభ్యులు కారు. వీరు కొంతకాలం ఉపప్రధానిగా కూడా ఉండేవారు.

సభానంతరం ఈనాలుగు వేలమందీ ఎర్రజండాలనూ, మావో చిత్రపటాలనూ పట్టుకొని, నినాదా లిచ్చుకుంటూ పెకింగ్ వీధుల్లో ఊరేగింపు జరిపారు.

ఈ పార్టీలకు చెందిన కొందరు ముఖ్యులు కమ్యూనిస్టుపార్టీనీ, ప్రభుత్వాన్నీ పడగొట్టడానికి కుట్రలు పన్నారని ఇటీవల వెల్లడి కావడంతో చైనాలోని ఏడుకమ్యూనిస్టేతర పార్టీలు అప్రతిష్టపాలయ్యాయి.

ఇది జరిగిన తరువాత దేశమంతటా ఈ పార్టీల శాఖలు సమావేశాలు జరిపి ఆత్మ పరిశోధనకు పూనుకున్నాయి.

పెట్టుబడిదారీ తత్వం తమకింకా వదలలేదనీ, మితవాద పలుకుబడి ఇంకా పూర్తిగాపోలేదనీ షాంఘై, పెకింగ్ నగరాల్లో ఈ పార్టీలు ఇటీవల సమావేశాలు జరిపి తీర్మానాలు చేశాయి.

భారతదేశంలో నిరాయుధీకరణ

లోక్‌సభలోని తనప్రసంగంపై ఆచార్య కృపలానీ వివరణ

న్యూఢిల్లీ, మార్చి 16

లోక్‌సభలో శుక్రవారం నాడు జరిగిన బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతూ ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ ఆచార్య కృపలానీ తాను "ఎదటివాళ్ళు కలసివస్తారా లేదా అని చూడకుండా ఎవరికి వారే ఆయుధాలను తగ్గించుకోవాలి" అని చెప్పడంలో అర్థం - సాయుధ దళాల్ని రద్దుజేయమని గాదనీ దఫాల వారీగా ఆయుధ నిల్వల్ని తగ్గించడమేనని అన్నారు.

తన లోక్‌సభ ఉపన్యాసాన్ని విశదీకరిస్తూ చేసిన ఒక ప్రకటనలో శ్రీ కృపలానీ యిలా అన్నారు :

"దేశం యింతవరకు రక్షణబడ్జెట్లను గుడ్డిగా ఆమోదిస్తూవచ్చింది. కాని ఇకముందు రక్షణబడ్జెట్లను, రక్షణ ఖర్చుల్నిగూర్చి పార్లమెంటులోను, దేశంలోను స్వేచ్ఛగా ఒక లక్ష్యాన్ని దృష్టిలోపెట్టుకొని చర్చించాల్సిన సమయం వచ్చింది."

"నేను మొత్తం సాయుధదళాన్నే రద్దుచేయమని కోరడంలేదు. ఎంచేతనంటే మొత్తం సాయుధ దళాల్ని రద్దుచేయడంవల్ల అది న్యాయరీత్యానూ, చట్టరీత్యానూ, నిరుద్యోగానికీ సంబంధించిన సమస్యలకు దారితీస్తుంది. అంచేత నేను సూచించేదల్లా - ఆయుధనిల్వల విషయంలోనూ, సాయుధదళాల విషయంలోను క్రమానుగతంగా తగ్గింపు జరగాలని మాత్రమే. భారతదేశం ఈ విషయంలో తనకు తానే, ఎదటి వాళ్ళతో నిమిత్తం లేకుండా ఒక నిర్ణయాన్ని తీసుకోవాల్సివుంది. ఏదిఏమైనప్పటికీ రక్షణఖర్చులు పూరికే పెరుగుతూ వుండకూడదు. అది ప్రథమచర్యగా ఉండాలి."

జీసప్స్ కంపెనీ తనిఖీకి కంట్రోలరు

న్యూఢిల్లీ, మార్చి 13

శ్రీ హరిదాస్‌ముంద్రా ఆధీనంలో గల జీసప్స్ కంపెనీ వ్యవహారాలను చూసే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం త్వరలో ఒక కంట్రోలరును నియమించగలదని తెలుస్తోంది.

(ఐ. పి. ఏ.)

శిఖరాగ్ర చర్చలు

త్వరలో జరగాలనేదే రష్యా వాంఛ అని మెన్షికోవ్

వాషింగ్టన్, మార్చి 16

సాధ్యమయినంత త్వరలో శిఖరాగ్ర సమావేశం జరగాలనే తన ప్రభుత్వం వాంఛిస్తున్నదని అమెరికాలోని సోవియట్ రాయబారి మైకేల్ మెన్షికోవ్ నేడొక టెలివిజన్ ప్రసంగంలో అన్నారు.

శిఖరాగ్ర సమావేశం జరుగుతే కొన్ని అత్యవసర సమస్యలు చర్చకు రావడమే కాకుండా, వాటిని గురించి ఒక స్పష్టమైన అవగాహనకూడా ఏర్పడుతుందని ఆయన అన్నారు.

"యువకులు తెలుసుకోగోరుతున్నారు" అనే టెలివిజన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొంటూ, తూర్పు పశ్చిమ రాజ్యాలమధ్య ఉద్రిక్తత, శిఖరాగ్ర సమావేశం, జర్మనీ ఏకీకరణ, వర్తక సాంస్కృతిక సంబంధాలు మొదలయిన అంశాలపై అనేక ప్రశ్నలకు జవాబులు చెప్పారు.

నిరాయుధీకరణను గురించి ప్రస్తావిస్తూ, ఆ సమస్య శిఖరాగ్ర సమావేశంలోనే చర్చించతగినదని మెన్షికోవ్ అన్నారు.

"కమిటీల్లోనూ, ఉపసంఘాల్లోనూ గతంలో ఎన్నిచర్చలు సంప్రతింపులు జరిగినా ఫలితం ఏమీ లేకపోయింది. కాబట్టి ప్రభుత్వాధిపతులు సమావేశం కావలసిన అవసరం ఉందని మెన్షికోవ్ అన్నారు.

జర్మనీ ఏకీకరణసమస్య శిఖరాగ్ర సమావేశంలో చర్చకురాగల సమస్యే కాదన్నారు. "దానిని తూర్పు పశ్చిమ జర్మనీలే పరస్పర సంప్రతింపులద్వారా పరిష్కరించుకోవడం మంచిదనేదే మా దృఢాభిప్రాయం" అని అన్నారు.

"సులభంగా పరిష్కారం చేసుకోగల సమస్యలెన్నో ఉన్నాయి. ఉదాహరణకునిరాయుధీకరణ సమస్య. ఇటువంటివాటిని శిఖరాగ్ర సమావేశంలో చర్చకు తేవచ్చు"నన్నారు.

శిఖరాగ్రసమావేశం వాషింగ్టన్‌లో జరుగుతే బుల్గానిన్, కృశ్చేవ్ లు రావడానికి అంగీకరిస్తారా అని మెన్షికోవ్‌ని ఒక ప్రశ్న అడిగారు.

ఆ సమావేశాన్ని వాషింగ్టన్‌లో జరపాలనే అమెరికా ప్రభుత్వం అనుకున్నట్లయితే, వారు తప్పకుండా రావడానికి అంగీకరిస్తారని మెన్షికోవ్ అన్నారు.

సిర్పూరు కార్మికులపై దాడి

ఐ. ఎన్. టి. యు. సి. అనుచరుల అఘాయిత్యం

సిర్పూరు, మార్చి 11

సిర్పూరుసిల్కు-ఫ్యాక్టరీలోపని చేసే7గురు కార్మికులునిన్న రాత్రి 11గంటలప్పుడు తమ డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్ళుతున్న సమయంలో కంపెనీ గేటుదగ్గర ఐ.ఎన్.టి.యు.సి. అనుచరులు వారినివిపరీతంగాకొట్టారు.

ఈఏడుగురు కార్మికులు ఐ.ఎన్.టి.యు. సి. యూనియన్ కు చందా ఇవ్వనిరాకరించి నందునవీరినికొట్టారు.

ప్రతినెల 10 వ తేదీన జీతాల సమయంలో పోలీసువారు కంపెనీ గేటువద్ద ఉండేవారు. ఈసారి బందోబస్తుకూడా చేయకపోవడంవల్లనే ఈ అల్లరి జరిగింది.

2 కోట్ల 84 లక్షల రైతులు

నవచైనా వయోజన పాఠశాలల్లో విద్యాబోధ

పెకింగ్, మార్చి 14

నవచైనాలోని వివిధ ప్రాంతాల్లోనూ 2 కోట్ల 84 లక్షల మంది రైతులు చదవడం వ్రాయడం నేర్పే అక్షరాస్యతా తరగతులకు హాజరవుతున్నారని నవచైనా విద్యాశాఖవారు ఒక ప్రకటన చేశారు. 14 రాష్ట్రాల్లోనూ, పెకింగ్‌నగరంలోనూతయారు చేసిన లెక్కల ప్రకారం యీ సంఖ్య తేలిందన్నారు.

వీరుగాక. మరో 35 లక్షలమంది రైతులు చదవడం, వ్రాయడం నేర్చుకొని, పై తరగతుల్లో చేరారనికూడా ఆప్రకటన తెలియజేస్తోంది.

లియోనింగ్ అనే రాష్ట్రంలో యువకులు, మధ్యవయస్కులైన రైతులు నూటికి 44 మంది యీ తరగతులకు హాజరౌతున్నారు.

అనేకరాష్ట్రాల్లో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో పనిచేస్తున్న రైతులుకూడా పలకలు, వాచకాలు, నోటుపుస్తకాలూ దగ్గర పెట్టుకొని తీరుబడిగా ఉన్నప్పుడు చదువుకుంటున్నారనికూడా ఆప్రకటన తెలియజేసింది. వీరికి చదువుచెప్పడానికి ప్రాజెక్టు కట్టడాలవద్ద ఉపాధ్యాయులు ఏర్పాటు చేయబడ్డారు.

బడ్జెట్‌పై చర్చకు నెహ్రూ జవాబు నేడే

న్యూఢిల్లీ, మార్చి 17

లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు ప్రధాని నెహ్రూ, రేపు ప్రశ్నాసమయం ముగియగానే సమాధానమిస్తారని స్పీకరు శ్రీ అనంతశయనం అయ్యంగార్ ప్రకటించారు.

జమ్మూలో కృష్ణమీనన్

జమ్మూ, మార్చి 16

భారత రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ చండీగఢ్ నుంచి విమానంలో ఈవేళ సాయంత్రం జమ్మూ చేరుకున్నారు.

ఇక్కడ జరుగుతున్న జమ్మూ - కాశ్మీర్ జాతీయ మహాసభ వార్షిక సమావేశంలో పాల్గొనేందుకై ప్రధాని బక్షీ గులాం మహమ్మద్ ఆహ్వానంపైన శ్రీ కృష్ణమీనన్ ఇక్కడికి వచ్చారు.

ఐక్య అరబ్ రిపబ్లిక్ అవతరణకు సిరియా కమ్యూనిస్టుల హర్షం

ప్రాగ్, మార్చి 16

సిరియా, లెబనాన్ కమ్యూనిస్టు పార్టీ ఐక్య అరబ్ రిపబ్లిక్ స్థాపనను హృదయపూర్వకంగా బలపరుస్తున్నదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఖలీద్ బాక్దాష్ "రూడ్ ప్రావో" పత్రిక సంపాదకునికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు.

సిరియా - ఈజిప్టుదేశాల సంలీనం ద్వారా ఏర్పడిన అరబ్ రిపబ్లిక్ విషయంలో సిరియా, లెబనాన్ కమ్యూనిస్టుపార్టీ వైఖరిని వివరిస్తూ ఆయన ఇలా చెప్పారు:

సామ్రాజ్యవాద కబంధ కౌగిలి నుంచి అరబ్ దేశాలను పూర్తిగా విముక్తంచేసి, ప్రజాస్వామ్య ప్రాతిపదికపై అరబ్ దేశాల ఐక్యతను సాధించాలన్న లక్ష్యంతో మా పార్టీ ఆది నుంచీ కృషి చేస్తున్నది.

సిరియా, ఈజిప్టు దేశాలను సంలీనం చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు మా పార్టీ ఆ ప్రతిపాదనను బలపర్చింది.

సిరియాలోని జాతీయ ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని మా పార్టీ బలపర్చుతున్నది. జాతీయ ఐక్యసంఘటనలో కమ్యూనిస్టు పార్టీ కూడా అంతర్భాగంగావుంది. అలాగే ఈజిప్ట్ ప్రభుత్వ విధానాలనుకూడా మాపార్టీ సూత్రప్రాయంగా బలపర్చుతున్నది. ఈ రెండు దేశాల సంలీనంద్వారా, అరబ్ దేశాల విముక్తికి దోహదమిచ్చే కార్యవిధానం జయప్రదం చేయవచ్చునని మా పార్టీ ఆశిస్తున్నది. అందుకోసం మా పార్టీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది.

అమెరికన్ సామ్రాజ్యవాద కుట్రలకు వ్యతిరేకంగానూ, ప్రజాస్వామ్య హక్కులకోసం, ప్రజల జీవనస్థితిగతులను మెరుగుపర్చటం కోసం, సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాలతో స్నేహసంబంధాలు పెంపొందించటంకోసం తమ పార్టీ ఇంతకుముందువలెనే పాటుబడుతూ వుంటుందని ఆయన చెప్పారు.

భారత ప్రభుత్వం రక్షణ వ్యయం వివరాలు

కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి వివరణ

న్యూఢిల్లీ, మార్చి 16

భారత రక్షణ బలాలకు చెందిన భూతల, నౌకా, విమాన శాఖలు మూడింటిని విస్తరింప చేసినందువల్లే రక్షణ వ్యయం పెరిగి పోతున్నదన్న భావాన్ని ధ్వనింప చేస్తూ పార్లమెంటులో కొందరు సభ్యులు వెలిబుచ్చిన అంశాలు సరికాదని రక్షణశాఖ ప్రతినిధి ఒకరు ఖండించారు.

కేంద్రబడ్జెట్‌లో రక్షణవ్యయ శాతం 1953-54 సంవత్సరంనుంచి ఈ క్రిందివిధంగా వున్నదని ఆయన వివరించారు:

1953-54 లో 44.79 శాతం, 1954-55లో 40.92 శాతం, 1955-56 లో 35.15 శాతం, 1956-'57 32.57 శాతం, 1957-58లో 36.70 శాతం కాగా, 1958-59 బడ్జెట్‌లో ఇది 36.17 శాతం మాత్రమే వుంది.

పోతే, కేంద్ర బడ్జెట్ పరిమాణం పెరిగిన ఫలితంగా, మొత్తం వ్యయంలో రక్షణ వ్యయం శాతం తగ్గినప్పటికీ, ఖర్చు చేస్తున్న మొత్తం మాత్రం 1953-54 కన్నా హెచ్చుగానేవుంది. 1953-54 లో రక్షణవ్యయం 196 కోట్లు కాగా, 1958-59 బడ్జెట్‌లో దేశ రక్షణకు కేటాయించిన మొత్తం 305 కోట్లు.

రక్షణ బలాల సంఖ్యను పెంచకుండానే, రక్షణ స్తోమతను ఇతోధికం చేస్తున్నామని రక్షణశాఖ ప్రతినిధి తెలిపారు.

రక్షణశాఖలలో పనిచేస్తున్న వారి జీత భత్యాలను పెంచటంవల్ల ఖర్చులు పెరిగాయి. 1958 - 59 సంవత్సరం నుంచి [illegible] భత్యాలు పెంచినందువల్ల సాలీనా [illegible] 11 కోట్లు అదనంగా ఖర్చు అవుతున్నది. అలాగే దేశ రక్షణకు అవసరమైన పరికరాల ధరలు అమితంగా పెరిగాయి. దీనివల్ల సాలీనా 70 కోట్లు అదనంగా ఖర్చు చేయవలసివస్తున్నది. అదీకాక, పాతబడి, ఎందుకు పనికిరాకుండా పోయిన రక్షణ పరికరాలను మార్చి, వాటిస్థానే కొత్త వాటిని అమర్చవలసి వస్తున్నది. వీటన్నిటివల్ల రక్షణశాఖలకు ఖర్చుచేసే మొత్తం పెరిగిందని ఆయన వివరించారు.

రక్షణశాఖలకు అవసరమైన పరికరాలను ఎక్కువ భాగం మనదేశంలోనే ఖరీదు చేస్తున్నామనీ ఇది శుభప్రదమైన పరిణామనీ ఆయన తెలిపారు. 1957-58 లో విదేశాలలో ఖరీదు చేసిన పరికరాల మొత్తం విలువ 98 కోట్లు, దేశంలో ఖరీదుచేసిన పరికరాల విలువ 45 కోట్లు. 1958-59లో విదేశాలలో ఖరీదుచేసేసరుకుల విలువ 92 కోట్లు మన దేశంలో ఖరీదుచేసే పరికరాలవిలువ 56 కోట్లు వుండగలదని అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు

మన దేశానికి ఒక్క పాకిస్తాన్ నుంచి మాత్రమే ప్రమాదంవుంది. లంక, బర్మా, చైనా దేశాలనుండి మనకు ఎలాంటి ముప్పు వాటిల్లదని కూడా ఆయన చెప్పారు.

బెంగాల్ రాష్ట్రంలో కరువు పరిస్థితులు

కలకత్తా, మార్చి 14

పశ్చిమ బెంగాల్ అంతటా కరువు పరిస్థితులు ఆవరిస్తున్నాయి. కొత్తధాన్యపు పంటవచ్చి సరిగ్గా రెండునెలలు కాకముందే రాష్ట్రం అంతటా ఆహారసంక్షోభం ఏర్పడింది.

కలకత్తాలోను, యితర పారిశ్రామిక ప్రాంతాల్లోను బియ్యంధరలు మణుగుకు రు 28, 29 ల వరకు పెరిగిపోయాయి. అలాగేకొన్ని జిల్లాల్లో 30, 32 రూపాయల వరకు కూడా ధరలు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు నానాబాధలు పడుతున్నారు.

ఈ దుస్థితిని గూర్చి కాంగ్రెసుకి, కాంగ్రెస్ ప్రభుత్వాలకి అనుకూలంగా వుండే పత్రికల్లో సహితం వార్తలు వస్తున్నాయి. దీన్నిబట్టి రాష్ట్రంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కరువు ఎంతతీవ్ర స్థాయిలో వుందో వూహించుకోవచ్చు.

మామూలుగా పశ్చిమబెంగాల్‌లో పండే తరుగుపంటకు తోడు 1956లో పెద్దఎత్తున వచ్చిన వరదలు, 1957లో కల్గిన అనావృష్టివల్ల మొత్తం రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక రంగం పెద్ద సంక్షోభంలో చిక్కుకుంది. తద్వారా గ్రామీణప్రాంత ప్రజల కొనుగోలు శక్తి పడిపోనారంభించింది. దీనికి తోడు రాష్ట్రంలో సామాన్య ప్రజలమీద పెరిగిపోతున్న పన్నుల భారం; తక్కువ ఆదాయాలు, కష్టించి పనిచేసేవారికి 'మూలిగే నక్కమీద తాటికాయ' పడ్డచందంగా వుంది.

ప్రభుత్వం ప్రజలగోడును పెడచెవిని పెడుతోంది. రాష్ట్రం, అతివాదపార్టీలు, యితర ప్రజాసంస్థలు చిన్నాభిన్నమైపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని కుదుటపర్చి, ఆహారలోటును పూడ్చడానికై చేసిన సూచనాలన్నింటిని ప్రభుత్వం తిరస్కరించింది. పైగా తన కేమీ పట్టనట్టు "ఆందోళన చెందాల్సిన పనిలేదు" అంటూ ప్రకటనలు మాత్రం చేస్తోంది.

ప్రజల నిశ్చయం

కాని రాష్ట్రంలో పరిస్థితి బాగా విషమిస్తోంది. సరైన చర్యలు కనక తీసుకోకపోతే మే ఆఖరుకి రాష్ట్రమంతటా పెద్ద ఎత్తున కరువు తాండవిస్తుంది. అయితే ప్రజలే ప్రమాదపరిస్థితి ఏర్పడకూడదని నిశ్చయించుకున్నారు. కిసాన్‌సభ, తదితర ప్రజాసంస్థలు, అతివాదపార్టీలు—తీసుకున్న కరువువాతబడి ఏ ఒక్క వ్యక్తి చనిపోకూడదనే కృషి నిశ్చయం కలకత్తాలో మార్చి 9 న జరిగిన రాష్ట్ర ఆహార మహాసభ నిర్ణయాల్లో ద్యోతకమయింది. ఈ మహాసభ ప్రభుత్వ దివాకోరుతనాన్ని బట్టబయలుచేసి, ప్రజలందర్నీ సమాయత్తపర్చి, ప్రభుత్వంమీద ఒత్తిడితెచ్చి ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు గట్టి చర్యలు తీసుకోవాల్సిందిగా నిర్ణయించింది. రాష్ట్రం అంతటా ఒక ఉద్యమాన్ని నడపడానికి కూడ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో అన్ని రాజకీయ పక్షాలవారిని సహకరించమని అర్థించారు.

ఈ మహాసభకు శ్రీ భవానీసేన్ అధ్యక్షత వహించారు. మహాసభలో మాట్లాడినవారిలో రాష్ట్రంలో ప్రముఖులయినవారు శ్రీ కపిల్ భట్టాచార్య ఒకరు. ఆహారధాన్యాల ఉత్పత్తిని మరింత అధికం చేయడానికి కావల్సిన కనీస పరిస్థితుల్ని కూడా కల్పించ లేక విఫలమైన ప్రభుత్వ చర్యల్ని శ్రీ భట్టాచార్య తీవ్రంగా ఖండించారు.

రక్షణ కోర్కెలు

ఈ మహాసభ ప్రభుత్వం ముందుంచిన ప్రధాన కోర్కెలు :

1. రాష్ట్రంలో ఏర్పడ్డ ఆహార లోటునంతా కేంద్రం భరించాలి. ఆహారధాన్యాల మొత్తంలో కనీసం 4 లక్షల టన్నులైనా బియ్యం రూపంలో వుండాలి.
2. రాష్ట్ర ప్రభుత్వం - బియ్యం మిల్లుల ద్వారా జరిగే ఉత్పత్తిలో అత్యధిక భాగాన్ని గుంజుకోవాలి; పట్టణాల్లోను, గ్రామీణ ప్రాంతాల్లోనూ దాచివుంచిన అదనపుధాన్యపు నిల్వల్ని ప్రజలచే ఎన్నికైన కమిటీల సహాయంతో స్వాధీనం చేసుకోవాలి.
3. కొన్ని మార్పులతో చేసిన రేషనింగ్‌ని కలకత్తాలోను, పారిశ్రామిక ప్రాంతాల్లోనూ, అలాగే ప్రతి యూనియన్‌కి, జిల్లా కేంద్రానికి విస్తృతం చేయాలి.
4. క్షామ నివారణ పనులు పెద్ద ఎత్తున జరగాలి. దినకూలి రూపాయి న్నర ఉండాలి.
5. క్షామ నివారణకృషిలో ప్రజా సహకారం పొందాలి. వ్యవసాయ అప్పుల్ని నిరవధిగా సరఫరా చేయ్యాలి.

ఖార్టూమ్, మార్చి 16

ఈజిప్ట్ సిరియాలు కలిసి ఏర్పడిన ఐక్య అరబ్బు రిపబ్లిక్‌ని గుర్తించడానికి సూడాన్ ప్రభుత్వం నేడు నిర్ణయించింది.

'మునగాల పరగణాను ప్రత్యేక తాలూకాగాఏర్పాటుచేయాలి'

శ్రీ దొడ్డా నరసయ్య

(ఎం. ఎల్. ఏ. – హుజూర్ నగర్)

ముక్కోటిఆంధ్రప్రజలచిరకాల వాంఛ ఈడేర్చుకున్నాము. ఒక సంవత్సరం నాడు ఏర్పడ్డ విశాలాంధ్రలో పూర్వపు ఆంధ్ర-తెలంగాణా లనే భేదంగాని, ఆ ప్రాంతం, యీ ప్రాంతం అనే హద్దులుగానీ లేకుండా శాశ్వతంగా చెరిపి వేయబడ్డవి. [illegible] రాజధానిగా యావదాంధ్ర ప్రదేశ్‌ను ఒకే పరిపాలన క్రిందకు తెచ్చుకున్నాము.

యావదాంధ్ర ప్రదేశము ఏక పాలన క్రిందకు రావడంతో ఆంధ్ర-తెలంగాణాల సరిహద్దులలో వున్న ఎగుడు దిగుడు సరిహద్దుల సవరింపులు ప్రజల సౌకర్యం, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా తలెత్తిన వాటిలో మునగాల పరగణా సమస్య కూడా ఒకటిగా వుంది. ఈ కొద్దిపాటి సవరింపు అవసరమయిందని అందరూ గుర్తించారు.

భౌగోళిక సరిహద్దులు

కృష్ణాజిల్లాలోని నందిగామ తాలూకాలో ఒక భాగంగావున్న మునగాల పరగణా నల్లగొండజిల్లా మధ్యలో ఒక దీవిలాగ వుంటూవచ్చింది. 7 మైళ్లు నల్లగొండజిల్లాలో ప్రయాణం చేస్తే గాని మునగాల పరగణాకు చేరుకోము. ఈ ప్రత్యేకదీవికి తూర్పున హుజూరునగరు తాలూకా, దక్షిణం, పడమరలు సూర్యాపేట తాలూకా లున్నూ, ఉత్తరపు భాగంలో ఖమ్మంమెట్టు తాలూకా (జిల్లా) చే చుట్టబడివుంది. పరగణా మధ్యనుండి మచిలీపట్నం నుండి హైద్రాబాదుకు పోయే జాతీయరోడ్డు పోతుంది. పూర్వపు నైజాంచే చుట్టబడి వున్నప్పటికీ సరిహద్దులలో కష్టమ్సు నాకాలు ఎత్తేసేవరకు అన్ని విషయాలకూ జగ్గయ్యపేట మీదనే ఆధారపడుతూ వుండేది. నైజాం ప్రభుత్వం పోయిన తర్వాతనే అందుబాట్లో వున్న సూర్యాపేట, ఖమ్మంమెట్టు మార్కెట్లతో సంబంధాలు పెరిగినవి. దాదాపు 40 వేల జనాభా, చిన్న, పెద్దవి 40 గ్రామాలు గల మునగాల పరగణా కలకాలం ఇలా వేరుచేయబడింది. అందుకనే యీనాడు పూర్వపు హద్దులు సవరించుకోవాలనీ, సౌకర్యాలు అందుబాట్లోకి తీసుకురావాలని అందరూ కోరుతున్నారు.

ప్రజల అభిప్రాయాన్ని ఖాతరు చేయాలి

కృష్ణాజిల్లాలో ఇంకా కృత్రిమంగా వుంచడం పరిపాలనరీత్యా బాగు లేదని ప్రభుత్వం గుర్తించింది. అందుకు ప్రయత్నాలుకూడా ప్రారంభించింది. ఇలాంటి పరిస్థితులలో మునగాల పరగణా ప్రజలుకృష్ణాజిల్లా నుండి మార్చుతున్న పరగణాను అన్ని విధాలసౌకర్యం,సౌలభ్యంపొందుటకు అందుబాట్లోవున్న ఖమ్మంమెట్టు జిల్లాలో కలపమని కోరడం సహజం. కాని వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు గానీ, వారి కోరికను పరిశీలించేందుకుగానీ ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నించక పోవడం విచారకరం.

రాజకీయచదరంగం కారాదు

జిల్లా సరిహద్దులు మార్చే మునగాల పరగణా చర్చ ఏతాలూకాలో కలపాలనే చర్చగా తయారయ్యింది. సహజంగా తలెత్తిన యీచర్చ అసలు జిల్లా సమస్యను మరుగుపరచింది. ఏ తాలూకాలో కలపాలనేచర్చ ఇంటింటా ఎడతెగని రాజకీయచర్చగా తయారయింది. ఇదే సమయంలో ప్రజలమీద ఆధిపత్యం చలాయించే వారు వారివారి స్వప్రయోజనాలతో అధికారంలోవున్న వారిని అటూ, ఇటూ లాగుతున్నారు. అయినా ప్రభుత్వంగానీ, పాలకవర్గ అధికారులు గానీ యీవిషయాలు ప్రజలకు ఏమాత్రం పొక్కనీయడంలేదు. ప్రజాభిప్రాయాన్ని మన్నించుటలేదు.

1. నల్లగొండజిల్లా కాంగ్రెసు నాయకత్వం, పరగణాలోని కాంగ్రెసు నాయకత్వం కలిసి మునగాల పరగణాను నల్లగొండ జిల్లాలో చేర్చి, హుజూరు నగరు తాలూకాలో కలపాలని ఒడంబడిక కొచ్చారు. రాష్ట్ర కాంగ్రెసు నాయకత్వమును కూడా ఒప్పించామని చెప్పుతున్నారు. ఇటీవల జరిగిన కాంగ్రెస్ మండల ఎన్నికలలో హుజూరునగరుతాలూకా నిర్మాణంలో కలిపివేసారు. గవర్నరు గారి నల్లగొండక్యాంపు సందర్భంలో జిల్లా కాంగ్రెసు సమర్పించిన మెమొరాండములో చేర్చే సమస్య ఉదహరించారు.

పాలకవర్గ పార్టీగా కాంగ్రెసు నాయకులు చేసుకున్న యీ ఒడంబడిక ప్రకారమే [illegible] కలెక్టరు తహశీల్దార్ల తోను రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు కూడా చేయించారు. వీరు అందుకు కలసిన కొన్ని విషయాలు ముందుకు తెస్తున్నారు. సూర్యాపేటతాలూకా పెద్దతాలూకాగా వుంది. హుజూరు నగరు తాలూకాఇప్పటికేఅన్నిటికంటే చిన్న తాలూకా. అందుకని హుజూరు నగరు తాలూకాలోనే కలపాలి అని వాదించుతున్నారు.

2. కాంగ్రెసు నాయకత్వం చేసిన నిర్ణయం రుచించని మరికొంతమంది సహజంగా సూర్యాపేట తాలూకాలో కలపాలనే కనీస కోరికను ఆధారంచేసుకొని మునగాల పరగణాను మూడుముక్కలు చేయాలని ప్రయత్నించుతున్నారు. హుజూరు నగరు, సూర్యాపేట, ఖమ్మంమెట్టు తాలూకాలలో ఎటు అందుబాట్లో వున్న గ్రామాలను అటు కలపాలని వారివారి పలుకుబడిని ఉపయోగించుతున్నారు. ఇటీవలనే మునగాల పరగణాలో భూములు సంపాదించిన సూర్యాపేట దేశముఖు, వేములపల్లి భాస్కరరావు మొదలైన బయటి పెద్దలంతా పరగణాను పంచుకుందామని పరుగులెత్తుచున్నారు.

3. ఇక మునగాల జమీందారు ఇంకా కొంతకాలం వరకు సరిహద్దులు మార్చ సేనద్దని ముఖ్యమంత్రివరకూ పోయి మొరపెట్టుకున్నారు. కృష్ణా జిల్లానుండి మార్చితే ఇప్పటికే తెలంగాణములో వున్న కౌలుదారీ చట్టం వర్తించుతుందనీ, తన అక్రమఅమ్మకాలన్నీ ఆగిపోతవని యీ జమీందారు గారి భయం. అందుకనే ఇంత తాపత్రయం.

సమగ్ర పరిశీలన అవసరం

మునగాల జమీందారుగారు చేసే ప్రయత్నం పరగణాకు ఏమాత్రం ఉపయోగపడదు. తన స్వార్థం కొద్ది భూస్వాములు చేసే పాతకాలపు వాదన తప్ప వేరుకాదు. ఏమంటే విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడకపూర్వం నుంచీ మునగాల పరగణాను తెలంగాణాలో కలపాలనే ఆలోచన వుంటూ వచ్చింది. ఈ ఆలోచన ఆంధ్ర ప్రభుత్వము వచ్చిన నాటి నుండి పరగణాకు ఎంతో నష్టం జరిగింది. కృష్ణాజిల్లాలో ఒక భాగంగా వున్నదన్న మాటేగాని దానిఅభివృద్ధిని గురించి మాత్రం ఏ అధికారీ పట్టించుకోవడంలేదు. ఎలాగూ తెలంగాణాలో కలుస్తుంది అనే ధోరణి, పరగణాలో ఏ ఒక్క ప్రణాళికా ప్రవేశపెట్టకుండా నిర్లక్ష్యం చేయబడింది. చివరకు యన్. ఇ. యస్. స్కీము కూడా ప్రవేశపెట్ట నిరాకరించారు. కాబట్టి ఇంకా యీపరిస్థితిని కొనసాగించడం ఏమాత్రం పనికిరాదు.

ఇక పోతే సూర్యాపేట తాలూకా పెద్దగా వున్నది. అందులో మునగాల పరగణాను కలపడంవల్ల ఇంకా యీడి కయ్యే మాట వాస్తవం. అదే సందర్భంలో హుజూరునగరు తాలూకా చిన్న తాలూకాగా వున్నందువల్ల ఇంకా దానిని పెద్ద తాలూకాగా చేయనందువల్ల ఏమినష్టం జరుగుట లేదనీ, ముందుజరుగదనీ చరిత్రరుజువు చేసింది. పైగా తాలూకా యూనిటు తగు మోతాదులో చిన్నదిగావున్నందునసే ఏపనైనా చురుకుగా సాగిపోవడానికి,పరిపాలనా వ్యవహారాలు త్వరత్వరగా జరిగి పోవడానికి వీలుచిక్కుతుందని తేలింది. కాబట్టి చిన్నదిగా వుంది కాబట్టి అనే వాదన లోతైన అవగాహనతో చెప్పేదిమాత్రంకాదు.

ఎటు అందుబాట్లోవున్న గ్రామాలు అటు కలపండి అనే ప్రయత్నం ఏమాత్రం పరిపాలనా అనుభవం గానీ, పరగణాకు గల చరిత్రజ్ఞానం గానీ వుండి చేస్తున్నారనుటకు వీలు లేదు. వీరిది అందుబాటు అనే బండ మంత్రం మాత్రమే. వీరి వాదన ప్రకారం మూడు తాలూకాలలో కలిపిన తర్వాత యీ మూడు ప్రదేశాలలో కూడా పరగణా గ్రామాల రెవిన్యూ చట్టాలు మారిపోయేవరకు గననీయమైన కాలంవరకు – ప్రత్యేక స్టాఫ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవలసి వుంటుంది. ప్రతిసారి, ప్రతి సమస్యమీద రెండు చట్టాలు, రెండు రకాల వ్యవహారాలు సాగుతూ వుండాలన్నమాట. ఇది ప్రజలకు గాని, ప్రభుత్వ పరిపాలన దృష్ట్యా గాని ఏమాత్రం పనికిరానిది.

అంతేకాదు, మునగాల పరగణా అనబడే ఈప్రాంతం ప్రత్యేక చరిత్ర, విశిష్టత కలిగివుందనే విషయాన్ని గమనంలో వుంచుకోవాలి. తెలుగు దేశమును బ్రిటిష్ సామ్రాజ్యవాదులు - నైజాం నవాబులు ముక్కచెక్కలుగా పంచుకున్ననాడు నైతం దాని విశిష్టత అది కాపాడుకుంది. సామ్రాజ్యవాదులతోనూ, జమీందారుతోనూ, చివరను నైజాం నవాబుతోనూ సాగించిన అన్ని పోరాటాలలో అగ్రగామి పాత్ర వహించింది. యోధానుయోధులైన దేశభక్తులను సృష్టించింది. చివరకు తెలుగుదేశమంతా ఒకటి కావాలనే పోరాటంలో ఆంధ్ర, తెలంగాణాలను కలిపే కొలికి పూసగా పేరెన్నిక గన్నది. మునగాల పరగణా ప్రత్యేక చరిత్ర - విశిష్టత - కొమర్రాజు లక్ష్మణరావుగారి రచనపుట్లలో ఉదహరించబడిన చరిత్ర. అందుకని మునగాల పరగణాను మూడు ముక్కలుచేసే ఆలోచన, దాని చరిత్రను ముక్కలుచేసే ఆలోచన తప్ప వేరుకాదు.

మునగాల పరగణాను కృష్ణాజిల్లానుండి విడదీస్తున్న సందర్భంలో ఏజిల్లాలో కలపాలనే దాని కంటే దీనినెలా పరిశీలించాలనేదే ముఖ్యమైంది. పరగణా చరిత్రను నిర్లక్ష్యం చేయరాదు. పరిపాలనా సౌలభ్యంతో పాటు ప్రజలకు అందుబాట్లో వుండాలి. ఏదో ఒక తాలూకాలోనో, లేక రెండు మూడు తాలూకాలలోనో చేర్చి దాని వ్యవహారాలకు వేరేసిబ్బందినిపెట్టి ద్వంద్వ విధానం కల్పించకూడదు. సుదూరభవిష్యత్తులో దేశవ్యాపితంగా ప్రభుత్వం ఆడ్మినిస్ట్రేటివ్ అంగనిర్మాణానికి తలపెట్టిన మెహతా రిపోర్టుదృష్ట్యా కూడా సమస్యను ఆలోచించాలి.

అందుకని సూర్యాపేట తాలూకా ఇప్పటికే పెద్ద తాలూకాగా వుంది గనుక అందులోనుండి మునగాల పరగణాను చుట్టివున్న పెనబాడు ఫిర్కాను విడదీసి, మునగాల పరగణాలో కలిపి ప్రత్యేకంగా మునగాల తాలూకాను ఏర్పాటుచేయడం మంచిది. అలాఅయితే ప్రజలకు అన్నివైపులనుండి అందుబాట్లో వుంటుంది. అందుకు తగిన ఆర్థిక స్తోమత కలుగుతుంది.

ఈ ప్రత్యేక తాలూకా సూచనకు ప్రజల అభిప్రాయం అనుకూలంగా వుంది. ఈ విషయాన్నే నల్లగొండ జిల్లా పి. డి. ఎఫ్. యం. యల్. ఏ లు, పార్లమెంటు సభ్యుడు జనవరి 17 వ తేదీ ఆంధ్రప్రదేశ్ గవర్నరుగారిని ఇంటర్వ్యూ చేసి మెమొరాండం సమర్పించారు. ప్రభుత్వం యీ విషయం గమనించి సమస్యను పరిష్కరించడం మంచిది.

మార్కాపురం తాలూకాలో అటవీ సంపద: ప్రజలకు వృత్తులు కల్పించాలి

కొలుకుల, మార్చి 15

కర్నూలుజిల్లా మార్కాపురం తాలూకా గంజివారిపల్లె ఫారెస్టు రేంజిలో ఖనిజ సంపదలు నీటి వసతులు అపారంగా వున్నాయి. నారతడకల,పన్నలబైలు, రేగుమానిపెంట, గుట్టలచేను, పాలుట్ల అనేచోట్ల అనేక చెంచులు, లంబాడీలు నివసించే గూడాలు వున్నాయి. అపారమైన శక్తివంతమైన భూములు వున్నాయి. పైగా కావలసినంత ఎరువు సామగ్రి కొల్లలుగా వున్నాయి. కాని ఇక్కడ వుండే చెంచులు, లంబాడీలకు వ్యవసాయానికి కావలసిన వస్తు సముదాయంగాని, ప్రభుత్వ సహాయంగాని లేదు. ప్రభుత్వం ఏ కొద్దిపాటిగానైనా ఈ గూడెములప్రజలకు సహాయము చేసినట్లు తోచదు.

ఈ ఫారెస్టులో చిన్న చిన్న వాగులు ఉన్నాయి. వీటికి ఆనకట్టలు కొద్ది ఖర్చులో నిర్మించవచ్చు. తద్వారా చాలభాగం మాగాణీగా చేయవచ్చు. ఇక్కడికి దాదాపు 100 మైళ్ళ నుండి కూడా పశువులను మేతకొరకు పంపుతుంటారు. పశువులకు ముఖ్యమైన గ్రాసం ఈ ఫారెస్టు ప్రదేశంలో కొల్లలు. గుంటూరు, కృష్ణా జిల్లాలు, బాపట్ల వగైరా ప్రదేశముల నుండి కూడ దున్నలు, ఆవులు వగైరా పశువులు మేతకొరకు వస్తుంటాయి. ఇక్కడ నీటి ఇబ్బంది వుంది. కాబట్టి ఇక్కడ నీరు నిల్వచేయుట ద్వారా ఎంతో మేలు చేకూరుతుంది.

ఫలసాయం

కుంకుడుకాయలు, చింతపండు, కరక్కాయలు, ఎలక్కాయలు, చిటిమిటి కాయలు, నిమ్మకాయలు, కరివేపాకు, ఉసరకాయలు యింకా అనేకరకాలైన కాయలు కొన్ని లక్షల టన్నులు యిక్కడ ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని గ్రామాలకు చేర్చాలంటే ఏలాంటి రోడ్డు రవాణా సౌకర్యాలు లేవు. ఫలసాయాన్ని పట్నాలకుగానీ, పల్లెలకుగానీ చేరవేయాలంటే ఆవులమీద రావాలి. ఇది అందరికి అందుబాటులోలేదు. రోడ్డు రవాణా సౌకర్యములు లేనిమూలంగా ప్రభుత్వానికి రావలసిన లక్షల రూపాయలు ఆదాయం రాకుండాపోతున్నది. ఒక్క కుంకుళ్ళు, చింతపండు, చిల్లర ఫలసాయం అనే పేరుమీద వేలంవేస్తున్నారు. కాని యివికూడా క్రింది గ్రామాలకు చేరవేయాలంటే భగీరథ ప్రయత్నం చేయాలి.

ఇదిగాక తేనె, మైనంకూడా దొరుకుతుంది. గంజివారిపల్లె ఫారెస్టు రేంజి అని నామకేవాస్తే కొన్ని కట్టల మోపులు, చిల్లర ఫలసాయం కొద్ది ఆదాయంమీద వేలంవేస్తారు. ఉదాహరణకి బీడీలు తయారుచేసే ఆకు కావలసినంతవుంది. సరి దిగుమతులు సహాయం లేనందున ఎవరూ వేలం తీసుకోవడానికి సాహసించరు. కాని ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం కొన్ని లక్షల రూపాయల ఆదాయం రావడానికి అవకాశం వుంది.

ఖనిజాలు

ఇనుము, ఉక్కు, సిమెంటు, గడ్డితో కాగితాలు, కాశిగడ్డితో హీరాయిల్స్, సెంటులు, మంచి గృహాలను నిర్మించేందుకు కావలసిన మేలురకమైన రాళ్ళు, పౌడర్లు తయారుచేసే రంగు గనులు ఇంకా అనేకవిధాలైన అవకాశాలు కర్నూలు తూర్పు డివిజన్ ఈ గంజివారిపల్లె ఫారెస్టు రేంజిలో గుట్టలచేను, పాలుట్ల, పన్నలబైలు, నారతడకల వగైరా ప్రదేశాల్లో వున్నాయి. మరిబస్సురూట్లు, రవాణా సౌకర్యాలు జాతీగా లేనందున ఈ ప్రదేశాలకి ఏఉన్నతోద్యోగులు కాని, శాస్త్రజ్ఞులుకాని వచ్చినట్లు కనపడదు.

ఈ అడవులలో అనేక రకాలైన చెట్లు వగైరాలు పడిపోవడం అవన్నీ చెదులుపట్టడం ప్రతివారికి కన్పిస్తూనే వున్నాయి. ఒకవైపున గ్రామాల్లో, పట్టణాల్లో, కట్టెలు కరువై విపరీతమైన ధరలకు దొరకక అల్లాడుతుంటే లక్షోపలక్షల టన్నుల కట్టెలు, ఇతర సామగ్రి ఇక్కడ చెదులుపట్టుతున్నది. ఇంతకంటే దురదృష్టం మరొకటి ఉండబోదు.

ఆయుర్వేద ఔషధాలకు పనికి వచ్చే చెట్లక్రియలు ఏ వ్యాధికి కావలసిన వస్తువులైనా ఈ ప్రదేశాల్లో విపరీతంగా దొరుకుతాయి.

పెత్తందార్ల దోపిడీ

క్రింది గ్రామాల్లోవుండే కొంతమంది లంబాడీ ప్రజలను విపరీతంగా దోపిడి చేస్తున్నారు. కొన్ని గ్రామాల పెద్దలు కేవలం లంబాడీ చెంచు ప్రజలనుండే వారి మూలంగానే బ్రతుకుతుంటారు. ఉదాహరణకు చెంచులు, లంబాడీలకు నసాలులు (నులపంచాయితీలు) అనేవి వాడుకగా వుంటున్నాయి. అట్టి సందర్భాల్లో వారికి పంచాయితీతీర్పులకుకొంతడబ్బు అవసరం. క్రింది గ్రామాల్లో వుండే కొందరు కొంతడబ్బు యిస్తారు. రు80లు ఇస్తారనుకోండి. వందరూపాయలకు ప్రోనోటువ్రాయించుకొంటారు. పైగా సుహమాన్ (ఇనుము)గా ఒక ఆవును ఒప్పుకల చేసుకొంటారు. ఎనభై రూపాయలు అప్పుగా ఇస్తే, వడ్డీ కాక ఇరవైరూపాయలు, ఆవు ఒకటి ఆదాయం వస్తుందన్నమాట. ఈ విధమైన దోపిడీని అరికట్టే నాధుడేలేడు.

చెంచు, లంబాడీ బాలబాలికలకు కొన్ని స్కూళ్ళు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరి అక్కడికి ఏ ఉపాధ్యాయుడు పోయినా ఎల్లప్పుడూ అనారోగ్యంతో బాధపడుతుంటాడు. ఉపాధ్యాయునికి ప్రభుత్వం ఆరోగ్య విషయమై ఆ ప్రదేశాల్లో శ్రద్ధ తీసుకొన్నట్లు కనపడదు. అసలు ఆ ఉపాధ్యాయుని పరిస్థితి ఇపుడో, అపుడో అన్నట్లుంది. ప్రపంచాన్ని శాశ్వతంగా వదులుతాడేమోననిపిస్తుంది. మరి ఉపాధ్యాయునికి దిక్కు దివాణం లేకుండా ఎప్పుడూ జ్వరంతోనో, మరోవిధంగానో బాధపడుతుంటే అక్కడి పిల్లలకు విద్య ఎంతవరకు అబ్బుతుందో వేరే ఆలోచించనక్కరలేదు.

అటవీ సలహాసంఘం

ఈ మధ్యనే అటవీ సలహాసంఘాన్ని ఏర్పాటు చేయనున్నామని ఆంధ్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ సలహాకమిటీ ఇప్పుడు పని చేస్తున్నట్లుకూడ ప్రకటనవెలువడింది. ప్రధానమైన రాజకీయపార్టీల ప్రతినిధులతో తాలూకాల వారిగా సమావేశాలు ఏర్పాటుచేసి, ఇప్పుడు నియమించిన సలహాకమిటీని యింకా విస్తృతం చేసి అడవుల పరిస్థితి, అడవి ప్రజల అభివృద్ధి, అడవికి దగ్గరలో వుండే గ్రామాలప్రజలకు ఫారెస్టులో పనిపాటలు దొరుకునట్లు ప్రభుత్వం ముఖ్యమైన సంస్కరణలు చేయవలసి వుంది.

కర్నూలుప్రభుత్వ ప్రెస్ కార్మికుల ఇబ్బందులు

సూపరింటెండెంటు మారినా సూపర్‌విజన్‌లో మార్పు లేదు

('విశాలాంధ్ర' విలేఖరి)

కర్నూలు, మార్చి 15

కర్నూలు ప్రభుత్వ ప్రెస్ పనివారల ఇబ్బందులు పరిష్కారం చేయమని ప్రభుత్వ ప్రెస్ ఎంప్లాయస్ యూనియన్‌వారు ముఖ్యమంత్రి గారితో మొదలెట్టి ప్రెస్ సూపరింటెండెంటు వరకు లెక్కలేనన్ని సార్లు వినతిపత్రాలు పంపుకున్నారు. రాయబారాలు, సంప్రదింపులు జరిపారు. కార్మికమంత్రి శ్రీ సంజీవయ్య గారితో కూడా అన్నివిషయాలు కూలంకషంగా వివరించారు. అందరు పరిష్కారం చేస్తామని, సానుభూతితో పరిశీలిస్తామని చెప్పారు. కాని ఈనాటి వరకు ఫలితాలు మాత్రం శూన్యం. గత జూలైనెలలో యిచ్చిన మెమొరాండానికి యింతవరకు జవాబు కూడా లేదు.

ప్రెస్ సూపరింటెండెంటువల్ల ప్రెస్‌కు ప్రభుత్వానికి నష్టమని యూనియన్ ఆరోజుల్లో విశదీకరించింది. ప్రెస్ సూపరింటెండెంటు ప్రెస్‌నుంచి వెళ్ళిపోయారు. కానీ ఆయన సలహాలే నేటికి ప్రెస్‌లో అమలుజరుగుతున్నాయి. సూపరింటెండెంటు మారినా సూపర్‌విజన్ మారకపోవటం పనివారలకు దిగ్భ్రాంతి గలిగిస్తున్నది.

ప్రభుత్వ ప్రెస్ కర్నూలులో నిర్మించి 5 సంవత్సరము లయింది. ప్రభుత్వ ప్రధాన పరిశ్రమలలో ఒకటైన ఈ ప్రెస్‌లోని పనివారల సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పరిశ్రమ ప్రధానాధికారికి, ప్రభుత్వానికి పనివారల కోర్కెలను గురించిపంపిన విజ్ఞాపనలను విచారించలేదు.

మద్రాసు ప్రెస్ నుండి అధిక వేతనములతో ఆంధ్ర ప్రభుత్వ ప్రెస్‌కురప్పించిన వర్కర్లనుదాదాపు 5 సంవత్సరములైనను తిరిగి మద్రాసు ప్రెస్‌కు పంపకుండుటకు గల కారణము అగమ్యగోచరము! ప్రైవేటు రంగములో నిపుణులైన వర్కర్లు ఈ ప్రెస్‌లో పనిచేయుచుండ నప్పటికిని వీరికి యింకను ఆంధ్ర ప్రభుత్వప్రెస్‌లో పనిచేయుటకు కాలపరిమితిని పొడిగించుటకై అధికారులు అనుమతిస్తున్నారు. యూనియన్ తరఫున ప్రభుత్వానికి అనేకమార్లు తెలిపినను వీరిని మద్రాసు ప్రభుత్వ ప్రెస్‌కు పంపలేదు.

ప్రమోషనులలో అవకతవకలు

సంవత్సరాల తరబడి పనిచేస్తున్న పనివారలు సీనియారిటీ ప్రకారము ప్రమోషను పొందటానికి నోచుకోలేకపోతున్నారు. అధికారులకు యిష్టమైనవారు అక్రమ పద్ధతులలో ప్రమోషనులు పొందుతున్నారు. ప్రమోషనులు పొందబోవు సీనియరు వర్కర్లకు ప్రమోషను లివ్వక హైదరాబాదుకు బదిలీచేశారు. అధికారులకు ఇష్టమైన వారిని ఏ సెక్షనులో అధికవేతనము గల గ్రేడ్సు వుండినచో ఆయా సెక్షనులకు ప్రమోషనుల నిస్తూ ఆయా సెక్షనులలో గల సీనియరు వర్కర్లకు అన్యాయము గలుగజేస్తున్నారు. ఇందుమూలంగా సీనియారిటీ, విద్యార్హతగల, నిపుణతలకు ప్రాముఖ్యములేక మంటగలిసి పోతున్నవి.

వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వటంలో ఎలాంటి పరిధులు లేక కేవలం ఇష్టాయిష్టాలకు ప్రమోషన్లు యివ్వటం జరుగుతుంది. ఉదాహరణకు జి. సి. వెంకటసుబ్బయ్య వేర్ హౌస్‌లో రు35/-ల జీతానికి నియమితమై అసిస్టెంటుస్టోరుకీపరుగా నెలకు రు80/-ల జీతంతో ప్రమోషన్‌పొంది, మరల హెడ్‌డిస్పాచర్ గా నెలకు 90/-ల జీతంతో ప్రమోషన్ పొందారు. టి. ఎస్. రాజవేలు పిళ్ళెకూడా వేర్ హౌస్‌లో రు35/-ల జీతంతో వుండి ఇప్పుడు స్టోర్‌కీపరుగా నెల రు80/-లు జీతంతో ప్రమోషన్‌అయినాడు ఎ. వెంకటసుబ్బు డిస్పాచరు. నెలకు రు35/-లు.యిప్పుడు సీనియర్ డిస్పాచింగ్ క్లర్కు. నెలకురు75/-ల జీతం. ఇవిఅక్రమప్రమోషన్‌లు. వీటిని విచారించి యూనియన్ చేసిన ఆరోపణలు నిరాధారమని చెప్పగలరా? అని యూనియన్ ప్రతినిధులు సవాల్ చేస్తున్నారు.

సర్వీసుల లీనీకరణ

నేటికి ఇంచుమించు 16 నెలలైనప్పటికి హైదరాబాదు, కర్నూలులో వున్న ప్రభుత్వ ప్రెస్సులలోని పనివారల సర్వీసుల లీనీకరణ జరుగలేదు. ఈ రెండు ప్రెస్సులను ఏకపరచి స్కేల్సు, తదితర విషయములందు సమదృష్టి ప్రదర్శించవలసివుంది.

ఆంధ్ర ప్రభుత్వ ప్రెస్‌లో 5 సంవత్సరాలనుండిపనిచేస్తున్నప్పటికి వీరి వుద్యోగాలు ఖాయంకాలేదు. ప్రతిఏటా కొన్ని క్రొత్త ప్రింటింగ్ వర్క్సు రావడం, వాటికి తగిన సిబ్బందిని తీసికోవడం మూలంగా వుద్యోగుల సంఖ్య వృద్ధి అవుతున్న దేగాని తీసివేతలు జరుగలేదు. ప్రస్తుతము కేసు పంపుతున్న ఫారములు ఆఫీసుకు సరిపోకుండుట, కొన్ని క్రొత్త ఫారములను ప్రింటు చేయకపోవడం గూడ జరుగుతున్నది.

ప్రైవేటు ప్రెస్‌లలో ఎక్కువ అనుభవము పొంది నిపుణులైన వారు ఆంధ్రరాష్ట్ర అవతరణ తరువాత ప్రెస్‌లో చేరుటచే 30 సంవత్సరాలు వయస్సు మించిన వారికి రెగ్యులరైజు చేస్తూ ప్రభుత్వానుమతికై ఇంక్రిమెంట్లు యివ్వక ఆపివున్నారు.

క్యాంటీన్,విశ్రాంతిమందిరం

ప్రెస్‌లో 350 మంది పనివారు వున్నారు. పట్టిరీత్యా యింత ఎక్కువ మంది పనిచేసే పరిశ్రమలో విశ్రాంతి మందిరంగాని, క్యాంటీన్‌గాని లేదు. అవుట్‌పాస్‌పై బయటికిపోయి కాఫీగానీ, టీ గాని తీసుకొని తిరిగి రావలెనంటే చాలాకాలం వృధా అవుతున్నది. మధ్య విరామ సమయంలో కాస్త విశ్రాంతి తీసుకోవలెనన్నా విశ్రాంతిమందిరము లేదు. పైరెండు కూడ సాధారణపరిశ్రమలలో ప్రభుత్వం ఖచ్చితంగా వుంచడానికి శ్రద్ధ తీసుకొంటున్నది. కాని ప్రభుత్వ పరిశ్రమలో అడిగినను, అవసరమున్నను అమలుపరచలేదు.

ప్రెస్‌లో ప్రథమ చికిత్స "పెట్టె" పేరునకు మాత్రం వుంది. కాని, మందులుమాత్రం వుండవు.

ప్రెస్‌వర్కర్లు 5 సంవత్సరాల సర్వీసుగలవారున్నారు. చాలమంది రెగ్యులరైజు చేసి 14 నెలలు అవుతున్నది. అయినప్పటికి వర్కర్లకు రావలసిన బకాయి యింక్రిమెంట్లు రాలేదు.

మజ్దూర్లకు సెలవులు ఇవ్వాలని యూనియన్ చట్టరీత్యా కోరింది. దీర్ఘకాల ఆందోళన తర్వాత మజ్దూర్లకు సెలవులు ఇస్తామని చెప్పారు. కానీ, మజ్దూర్స్ సెలవులు పెట్టితే ఒక్కొక్క పర్యాయం ఇస్తున్నారు. మరోసారి జీతంలో మినహాయిస్తున్నారు. ఈవిషయంలో యూనియన్ ప్రతినిధులు అధికారులను కలుసుకుంటే, "పొరపాటు జరిగింది. ఇక మీదట అలా జరుగకుండా చూస్తా" మని చెప్పారు. తిరిగి అదే పాట. అలాకాకుండా మజ్దూర్లకు సెలవులు ఇవ్వడంలో అవకతవకలు జరుగకుండా చూడాలని వీరు కోరుతున్నారు.

సప్లిమెంటరీ బిల్లులు (సెలవులవి, గ్రేడ్లవి) అక్టోబరు నుంచి ఈ నాటి వరకు చేయలేదు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వడంలో జాప్యం

తాడిపత్రితాలూకా కమ్యూనిస్టు నాయకుని తీవ్ర విమర్శ

చీమలవాగుపల్లె, మార్చి 15

అనంతపురంజిల్లా తాడిపత్రి తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ పి. వెంగళనాయుడుగారు ఇలా వ్రాస్తున్నారు:

"1953 సంవత్సరం మార్చినెలలో తాడిపత్రితాలూకా చందన వీడు రైతులు 15 కుటుంబాలవారు గ్రామ నత్తంలోఉన్న 521 సర్వే నెంబరుకు, 24 కుటుంబాలవారు వచ్చారు. మేకలపల్లె హరిజనులు 231 సర్వే నెంబరుకు అర్జీలు పెట్టుకున్నారు. ఈ నెంబరు విస్తీర్ణం సుమారు 2. ఎకరాలు వుంటుంది. 8 మంది రైతులాక్రమించివున్నారు. ఈ ఆక్రమణదారులలో 6 మందికి స్థలం అనుకునే పట్టాభూమి 5 మొదలు 8 ఎకరాల వరకు వుంది. అందువలన ఈస్థలాన్ని ఖాళీ చేసినా వారికి వామిదొడ్ల ఇబ్బందిలేదు. నాటినుండి నేటివరకు తాలూకా అధికారులు మొదలుకొని జిల్లాఅధికారులు, మంత్రులదాకా ఈ సమస్యపోయింది. పెట్టిన దరఖాస్తులు, పోయిన రాయబారాలకు లెక్కలేదు. తాలూకా, జిల్లా అధికార్లు న్యాయమైన సమస్య అనివదలిపెట్టినా ఇబ్బందులు లేవని చేదఖల్ నోటీసు జారీ చేశారు. అయినప్పటికీ ఎం. ఎల్. ఎ.ల (శ్రీ చిదంబరరెడ్డి, టి. రామచంద్రారెడ్డి, సి. సుబ్బారాయుడు) అండ సంపాదించి [illegible] జిల్లా కలెక్టరునుండి ఆర్డరు సంపాదించారు. నూతన జిల్లా కలెక్టరు పై స్టేఆర్డరును కొన్నాళ్ళకు రద్దు చేశారు. రవెన్యూబోర్డుద్వారా తిరిగి స్టే ఆర్డరు తీసుకొచ్చారు.

తాలూకా అధికారులు మొదలు జిల్లా అధికారుల దీనిని ఇది పేదలకు [illegible] అక్రమదారులపై ఇన్జక్షన్ వేసివుంచి 1955 సంవత్సరం జమాబంది సందర్భంలో వదలు కొంటామని భూస్వాములు రాజీనామా ఇచ్చారు. ఇంత అనుకూలమైన అవకాశాలుండి నప్పటికీ యం. యల్. ఏ. ల ప్రోత్సాహంతో తిరిగి రివెన్యూ బోర్డుకు పంపారు. రెవెన్యూబోర్డు ఎవరిది న్యాయమంటుందో చూడవలసి వుంది.

యాడికిఫిర్కా కోనప్పలపాడు హరిజనులు 40 కుటుంబాలు సంవత్సరం క్రితం యిండ్లస్థలం కావాలని తాలూకా జిల్లా అధికారులకు అర్జీలు పెట్టారు. కడకు అర్థం డబ్బుకూడా పెట్టుకుంటామన్నారు. ప్రభుత్వం మాత్రం పలుకడంలేదు. కడకు వీరికి స్మశానస్థలంకూడా లేదు. 2 మైళ్ళ దూరంపోయి కోనవంకలో శవాలను పూడ్చుకుంటున్నారు. ఊరికి తూర్పు దిశన పైరు సగం అంటనిభూమివుంది. వాటిని ప్రభుత్వం కొనియిస్తే భూమి కూడా అర్థండబ్బు భరిస్తామని అంటున్నారు.

తూట్రాల పల్లెలో 3 సంవత్సరాలైంది, 30 కుటుంబాల హరిజనులు అర్జీలు ఇచ్చుకున్నారు. ఒకతూరి ప్రభుత్వాధికార్లు వచ్చి చూచి వ్రాసుకొని పోయ్యారు. త్వరలో భూమి కొనిఇస్తామన్నారు. ఇంతవరకూ అతీగతీ లేదు. ఇన్నాళ్లుగా ఈ గ్రామాలవారు పట్టుదలతో కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం యిండ్లస్థలాలు చూపించలేకపోతున్నదంటే సరి ఎవరికి యిండ్లస్థలాలకు డబ్బు కేటాయిస్తున్నట్టో అర్థం కావడంలేదు. స్మశానానికి, ఇండ్ల స్థలాలకు స్థలం చూపలేని ప్రభుత్వం సోషలిజం తెస్తానని ప్రజలను ఉవ్విళ్ళూరిస్తే నమ్మడం ఎలా సాధ్యమవుతుంది. కాన ప్రభుత్వం ఇప్పుడైనా కదలి ఈ గ్రామాలకు వెంటనే స్థలం మంజూరు చేయాలని ఆశిస్తున్నాను."

లేఖలు

'కొత్తగూడెంలో డిప్యూటీ కలెక్టరును నియమించాలి'

మహాశయా,

ఖమ్మం జిల్లాలో 38 ఇ. సెక్షన్‌ను ప్రప్రథమంగా గత హైద్రాబాదు ప్రభుత్వం అమలు జరిపింది. 38 ఇ, 37 ఎ. సెక్షన్లకు సంబంధించిన పత్రాలు కౌలుదార్లు కలిగి వున్నప్పటికి భూస్వాములు పైర్లు కోయించడం, కేసుల్లో ఇరికించడం వగైరా జరుగుతున్నది. ఈ విషయాన్ని ఎన్నోసార్లు మంత్రుల దృష్టికి, అధికార్లదృష్టికి తేవడం జరిగింది. రెండవవైపున ఇందుకు సంబంధించిన కొన్ని వందలకేసులు కొత్తగూడెం డిప్యూటీకలెక్టరుకార్యాలయంలో విచారణలో నున్నవి. ఒక్క గాదెపాడు గ్రామంలోనే 130 కేసులు డిప్యూటీకలెక్టరు కార్యాలయంలో విచారణలో నున్నవి.

సుమారు 8 మాసములనుంచి కొత్తగూడెంలో డిప్యూటీకలెక్టరులేనందున విచారణలు ఆగిపోయినవి. రైతాంగం ఎంతో శ్రమపడి కాలినడకన, వ్యవసాయపనులను కుంటుపరచుకుంటూ అధికవ్యయ ప్రయాసలకు లోనవుతూ వెళ్ళినప్పటికీ డిప్యూటీకలెక్టరు లేనందున, కార్యాలయ ఉద్యోగులకు ముడుపులు చెల్లించుకోలేని స్థితిలో నుండుటవలన, సాయంత్రమువరకూ కార్యాలయంముందర పడిగాపులు పడవలసి వస్తున్నది. రెండవవైపున స్థానిక భూస్వాములు ఈ అదనుచూచుకొని విజృంభిస్తున్నారు. ప్రభుత్వంయొక్క ఈచర్య భూస్వాములకు తోడ్పడేవిధంగా నున్నదని, సదుద్దేశ్యంతో జరిపే కౌల్దారీ యోగక్షేమ చట్టంగా లేదని శంకించవలసివస్తున్నది.

ప్రభుత్వం ఇప్పటికైనా కొత్తగూడెంలో డిప్యూటీకలెక్టరును నియమించి కౌల్దార్ల న్యాయమైన హక్కులను కాపాడవలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు,
మంగపతిరావు,
ఇల్లెందు తాలూకా రైతుసంఘ
కార్యదర్శి.

భారతీయ చరిత్ర పరిశోధన మహాసభ వార్షిక సమావేశం ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మార్చి 23, 24 తేదీలలో జరుగుతుంది.

నోటీసు

నర్సారావుపేట తాలూకా గణపవరం గ్రామ నివాసులు కాటా హనుమయ్య, రామయ్యలు గత రెండు మాసముల నుండి కన్పించుటలేదు. దురాశాపరులెవరో వారిని బంధించి, బలాత్కారముగా వారి పేర నున్న ఆస్తిని గాజేయు తలంపుతో నున్నట్లు తెలియుచున్నది. లా ప్రకారము వారి పేరే ఆస్తులలో యెట్టి హక్కులు లేవు. ఒకవేళ వున్నప్పటికి వారు చేయబోవు అన్యాక్రాంతములో వారిని గాని వారి యొక్క కుటుంబ సోదరులగు నర్సయ్య,కోటయ్యలనుగాని బద్ధపరచజాలవు.

ఇట్లు,
నల్లపాటి కోటేశ్వరరావు,
అడ్వొకేటు, నర్సారావుపేట.

తాడేపల్లి పంచాయతీ

గుంటూరుజిల్లా తాడేపల్లి పంచాయతీ తాలూకు 1958-59 సంవత్సరమునకు చెందిన యీ దిగువ వేలంపాటలు ది 26-3-1958 సాయంత్రం 2 గంటలకు పంచాయతీ ఆఫీసువద్ద జరుపబడును. ఆదేరోజున సాయంత్రము 4 గంటలవరకు 58-59 సంవత్సరపు తాలూకు యీ దిగువ చెప్పబడిన కంట్రాక్టులుకూడా తీసుకొనబడును. పూర్తి వివరములు ఆఫీసులో తెలుసుకొనవచ్చును.

వేలంపాటలు

1. మార్కెట్టు రుసుములు వసూలు చేసుకొను హక్కు.
2. బండ్లదొడ్డి రుసుములు వసూలు చేసుకొను హక్కు.
3. తాటిఆకు, ముష్టికాయ అనుభవించు హక్కు.

కంట్రాక్టులు

1. పశువులకు గ్రాసము సప్లయి చేయుట.
2. కిరసనాయిలు, అగ్గిపెట్టెలు సప్లయి చేయుట.

యం. కోటేశ్వరరావు,
కార్యనిర్వాహణాధికారి 17-3-58.

విద్రోహులపై కేంద్ర ప్రభుత్వం శక్తివంతంగా దాడి చెయ్యాలి

అలా జరిగినప్పుడే ఇండోనేషియాలో అంతర్యుద్ధ ప్రమాదం నివారించబడగలదని కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి ఐదిత్ ప్రకటన

జకార్తా, మార్చి 16

సుమత్రా తిరుగుబాటుదారులపై ఇండోనేషియా కేంద్రప్రభుత్వం, సత్వరమే సమర్థవంతమైన సైనిక చర్యలు తీసుకోవలెనని ఇండోనేషియా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి ఐదిత్ ఇటీవల ఒక పత్రికాగోష్ఠిలో చెప్పారు. అలా జరిగినప్పుడే, దేశంలో అంతర్యుద్ధాన్ని ప్రజ్వరిల్ల జేయాలనే తిరుగుబాటుదారుల యత్నాలు విఫలం కాగలవని శ్రీ ఐదిత్ అన్నారు.

పత్రికా గోష్ఠిలో విలేఖరు లడిగిన ప్రశ్నకు సమాధానంగా ఐదిత్ ఈక్రింది విషయాలను తెలియజేశారు.

విద్రోహుల పట్ల కఠినంగా ప్రవర్తించాలి. ప్రభుత్వం విద్రోహులపట్ల అవలంబిస్తున్న వైఖరి మొత్తంమీద సరియైనదేనని భావిస్తున్నాను.

ఆత్మగౌరవంగల ఏ ప్రభుత్వం కూడా విద్రోహులపై చర్యలు తీసుకోకుండా ఊరుకోదు. అమెరికాలో ఒక తిరుగుబాటువస్తే అమెరికా ప్రభుత్వం ఇంతకంటె తీవ్రమైన చర్యలను తీసుకుని ఉండేదని నా అభిప్రాయం.

ఈ కల్లోలాలను పెంచి దేశాన్ని అంతర్యుద్ధంలో ముంచెత్తటం విద్రోహుల లక్ష్యం. ఆ లక్ష్యం నెరవేరదని నా నమ్మకం. అయితే ప్రభుత్వం సత్వరమే విద్రోహులపై శక్తివంతమైన చర్యలుతీసుకున్నప్పుడే ఇది సాధ్యం. అలాకాక సాచివేతగా ప్రవర్తిస్తే అంతర్యుద్ధాన్ని సృష్టించాలనే విద్రోహుల కుట్ర జయప్రదం కావచ్చును. లేక ఏదైనా విదేశ సామ్రాజ్యవాదం జోక్యం కల్పించుకున్నా అంతర్యుద్ధం ఏర్పడవచ్చు.

అలాంటి పరిస్థితి ఏర్పడితే ఈ సమస్య కేవలం ఇండోనేషియా అంతరంగిక సమస్యగానే ఉండిపోదు. ఆసియా ఆఫ్రికా దేశాల కన్నింటికీ సంబంధించిన సమస్య అవుతుంది. ఇండోనేషియా ప్రజలు అంతర్యుద్ధాన్ని జయప్రదంగా అణచివేస్తారు కూడా. కాని పరిస్థితులు అంతగా విషమించక పోవచ్చు. ఏమంటే, సైన్యంలో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వానికి విధేయులుగా ఉండటమే ఇందుకు కారణం" అని ఐదిత్ అన్నారు.

మరొక ప్రశ్నకు సమాధానంగా ఐదిత్ ఇలా అన్నారు :

"కమ్యూనిస్టు వ్యతిరేకత అనేది విద్రోహులకు ఒకముసుగు మాత్రమే. తిరుగుబాటు దార్లంతా, అవినీతికి, లంచగొండి తనానికి, మోసానికి పేరుపడ్డవారు. అలాంటివాటిని మేము గట్టిగా వ్యతిరేకిస్తాము. కనుక వారు కమ్యూనిస్టులను తమ శత్రువులుగా భావించవచ్చు. ఇట్టి అవినీతిపరులతో శత్రుత్వం మాకు గౌరవప్రదమే"నని ఐదిత్ అన్నారు.

ప్రస్తుత కేంద్రప్రభుత్వంలో కమ్యూనిస్టు లెవ్వరూ లేరని, సోకర్నో అధ్యక్షులు, తనకు తానై దేశక్షేమం దృష్ట్యా అన్నిపార్టీల సహకారాన్ని కోరుకుంటున్నారని ఐదిత్ అన్నారు.

ఇంకా ఇతర ప్రశ్నలకు సమాధానంగా యిలా వివరించారు.

జువాండా ప్రభుత్వంలో ప్రస్తుతానికి మార్పు లేమీ అక్కరలేదని మా అభిప్రాయం. భవిష్యత్తులో సోకర్నో అధ్యక్షుని అభిమతానుసారం, గోటాంగ్ రాయోంగ్ ప్రభుత్వం ఏర్పడితే ఆప్రభుత్వాన్ని ప్రజలంతా బలపరుస్తారు.

సోకర్నో అధ్యక్షులు జాతీయ సమితిని ఏర్పాటుచేసి ప్రభుత్వం నిర్వహిస్తున్నారు. ఇండోనేషియా రాజ్యాంగానికి ఈ చర్య విరుద్ధమని కొందరంటున్నారు. అది సరికాదు. సోకర్నో పరిపాలన పూర్తిగా రాజ్యాంగ బద్ధమైనది.

పశ్చిమ ఇరియన్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాంతంపై ఆర్థిక దిగ్బంధాన్ని విధించింది. ఈ చర్య సత్ఫలితాల నివ్వగలదని ఆశిస్తున్నాను.

విదేశీ నౌక లేవీ ఆ ప్రాంతంతో వ్యాపారం చేయకుండా కట్టుదిట్టం చేయాలి. ఇప్పటికీ పశ్చిమఇరియన్‌తో వ్యాపారంచేస్తున్న విదేశీప్రభుత్వాలకి ఇండోనేషియా ప్రభుత్వం ఒక హెచ్చరిక చేయటం అవసరం.

పశ్చిమ ఇరియన్ విముక్తికై ఇండోనేషియా ప్రజలు జరుపుతున్న పోరాటం, తిరుగుబాటుదారులను అణచటానికి చేస్తున్న పోరాటం – ఈ రెండూ జాతీయ విముక్తిపోరాటంలో భాగమేనని ఐదిత్ తన పత్రికాగోష్ఠి ముగించారు.

మెదాన్ విమానాశ్రయం

తమవశమైనట్లు విద్రోహుల ప్రకటన

సింగపూర్, మార్చి 16

ఉత్తర సుమత్రాలోని మెదాన్ విమానాశ్రయాన్ని మధ్య సుమత్రా తిరుగుబాటుదార్లుపట్టుకొన్నట్లు నేటి రాత్రి పడాంగ్ రేడియో ప్రకటించింది.

శతఘ్నిదళం సహాయంతో ఈ దాడి జరిగినట్లు పడాంగ్ రేడియో కథనం.

సోకర్నోకి విధేయులైవున్న బలగాలు విమానాశ్రయాన్ని రక్షించలేక పోయాయని కూడా ఆరేడియో పేర్కొంది.

కేంద్రప్రభుత్వ సేనాధిపతి బ్రిగేడియర్ జనరల్ జాతాకుసుమ దేలేవాన్ పారిపోవాలని చూస్తున్నట్లు కూడా ఆరేడియో పేర్కొంది.

సివిల్ పింఛను దారుల సంఘం

హైద్రాబాద్, మార్చి 15

ఆంధ్రప్రదేశ్ సివిల్ పింఛను దారుల సంఘానికి ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడు ప్రారంభోత్సవం చేశారు. ప్రతి ప్రభుత్వశాఖకు చెందిన పింఛనుదారులు ఈసంఘంలో వేరువేరు ఉపసంఘాలుగా ఏర్పడి ప్రభుత్వానికి ఆయా శాఖల విషయమై తగు సలహాలు ఇస్తూ ఉండాలని సంజీవరెడ్డిగారు తన ప్రసంగంలో ఒక సూచన చేశారు. "ఈ విధంగా వారు తమ అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించవచ్చు"నన్నారు.

ఈ సభకు అధ్యక్షత వహించిన మునుపటి హైదరాబాదు ప్రభుత్వ ఆర్థిక సలహాదారు ప్రొఫెసర్ కేశవ అయ్యంగారు సర్వీసులో వయఃపరిమితిని 55 సంవత్సరాలుగానే ఉంచడం నేటి పరిస్థితులకు సరికాదన్నారు.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ బక్కాత్ రాయు మాట్లాడుతూ, రెండవ పంచవర్షప్రణాళిక విజయం అనుభవజ్ఞుల సహకారంపై ఆధారపడి ఉన్నదని, ఈ విషయంలో పింఛనుదారులకు చాల ప్రాముఖ్యం ఉన్నదని అన్నారు.

ఇంగ్లీషు భాషాభిమానుల సదస్సు

హైద్రాబాదులో

హైద్రాబాద్, మార్చి 15

ఏప్రిల్ మొదటివారంలో హైదరాబాదులో ఇంగ్లీషు భాషాభిమానుల సదస్సు ఒకటి జరుగబోతూంది. రాజ భాషగా ఇప్పుడున్న ఇంగ్లీషునే అట్టిపెట్టాలనే వాదనకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడమూ, ఇదే ఉద్దేశంతో ఇటీవల మద్రాసులో జరిగిన దక్షిణభారత సదస్సుతో సంఘీభావాన్ని ప్రకటించడమూ దీని లక్ష్యం.

మేయరుగా శ్రీ మిరాజ్ కర్

బొంబాయి, మార్చి 16

కమ్యూనిస్టు నాయకుడు శ్రీ మిరాజ్ కర్ ఈ సంవత్సరానికి బొంబాయి మేయరుగా ఎన్నికౌతారు.

మేయరు ఎన్నిక ఈ నెలలోనే జరుగుతుంది. అందుకోసం సంయుక్త మహారాష్ట్రసమితివారు మేయరు పదవికి శ్రీ మిరాజ్ కర్‌ని నేడు ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

ప్రజాసోషలిస్టు పార్టీవారు శ్రీ జి. బి. మహాశబ్దేని మేయరుగా నిలబెట్టాలని చాలాపట్టుపట్టారు. కాని కొంత చర్చ జరిగినమీదట కోర్కె ఉపసంహరించుకొన్నారు.

తెలంగాణా కాంగ్రెసు శాసన సభ్యుల సమావేశం

హైద్రాబాదు, మార్చి 16

తెలంగాణాకు చెందిన కాంగ్రెసు శాసనసభ్యులు సమావేశమై ఈ నెల 27 న శ్రీ ఢేబర్ సమక్షంలో తెలంగాణా ప్రాంతీయ కమిటీకి అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకోవాలని నిర్ణయించారు.

మొత్తం 105 మంది తెలంగాణా శాసన సభ్యులలోను కాంగ్రెసువారు 68 మంది పి. డి. ఎఫ్. కమ్యూనిస్టు బ్లాకువారు 28 మంది, సోషలిస్టులు నలుగురు, ప్రజాసోషలిస్టు ఒకరు, ప్రజాపార్టీ ఒకరు, నిమ్నజాతి సమాఖ్యకు చెందినవారు ఒకరు, స్వతంత్రులు ఏడుగురువున్నారు. (వి.వి.)

మనిషిని పోలిన జంతువు

హేగ్, మార్చి 16

మనిషిని పోలిన ఒక వింత జంతువును దక్షిణ సుమత్రాలోని సబమూలియ అనే గ్రామంలో పట్టుకొన్నారని నెదర్లాండ్స్ వార్తాసంస్థ క్రిందటి వారం జాకార్తా నుంచి ఫోటోగ్రాఫ్ పంపింది.

ఇది ఆడజంతువు. శరీరంనిండా దట్టంగా రోమాలున్నాయి. వయస్సు 17 సంవత్సరాలుంటుందని అంచనా కట్టారు.

ఇలాంటి జంతువొకటి దక్షిణ సుమత్రా అడవుల్లో వుందని శాస్త్రజ్ఞులకు చాలకాలంనుంచీ తెలుసును. ఈ జంతువును అక్కడివారు "సింఢై" అని పిలుస్తారు. దీన్ని పట్టుకున్న వారికి బహుమతి ఇస్తామని చాలా కాలంక్రిందట అప్పటి డచ్చిప్రభుత్వం ఒకప్రకటనకూడా చేసింది.

రైల్వే మంత్రికి గాయాలు

న్యూఢిల్లీ, మార్చి 16

ఢిల్లీ గోహాటక్ రోడ్డులో రైల్వే మంత్రి ప్రయాణం చేస్తున్న కారు ఒక గ్రామంవద్ద ప్రమాదానికి లోనైంది. కారు క్రిందపడి ఒకవృద్ధుడు మరణించాడు. రైల్వే మంత్రికీ, ఆయన వెంటగల మరి ఇద్దరికీ చిన్న చిన్న గాయాలు తగిలాయి.

కారు గ్రామం దగ్గరకు వచ్చేసరికి వృద్ధుడు రోడ్డు దాటబోయి కారు కింద పడ్డాడు. వృద్ధుణ్ణి తప్పించబోయిన కారు ఒక చెట్టుకు గుద్దుకొంది. ఆస్పత్రిలో చేర్చిన తర్వాత వృద్ధుడు మరణించాడు. మంత్రికి ముక్కు మీద, కంటికింద, కాలిమీద చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. కారు మాత్రం నుగ్గు నుగ్గు అయిపోయింది.

కొలంబోలో జరుగుతున్న ఆగ్నేయాసియా ఆర్థిక కమిషన్ సభ ముగిసింది. అన్ని విషయాలపై సంపూర్ణమైన ఏకాభిప్రాయం వచ్చిందని సమావేశానంతరం ఒక ప్రకటన వెలువడింది.

విశాఖపట్టణం మునిసిపల్ కౌన్సిల్

24 వ తేదీన ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

వైజాగ్, మార్చి 16

విశాఖపట్టణం మునిసిపల్ ఛైర్మన్ శ్రీ ఎ.వి. భానోజీరావుపై అవిశ్వాసం వెలిబుచ్చుతూ 24 గురు సభ్యులు నోటీసిచ్చిన సంగతి పాఠకులకు విదితమే. ఆ తీర్మానం చర్చించడానికి గాను యీ నెల 24 వ తేదీన జిల్లా కలెక్టరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

మైసూరు కాంగ్రెసులో కలతలు

బెంగుళూరు, మార్చి 16

మైసూరు కాంగ్రెసు శాసనసభ పార్టీలో కలతలు కొద్దిరోజులనుంచీ తీవ్రతరమయ్యాయి. నిజలింగప్ప మంత్రివర్గాన్ని వ్యతిరేకించేవారు సంతకాల ఉద్యమాన్ని ప్రారంభించారు.

ప్రభుత్వ వ్యతిరేకవర్గం సంఖ్య చాలా పెరిగిందని ఆ వర్గానికి చెందిన ప్రముఖుడు ఒకరు పత్రికల వారితో చెప్పారు.

సంతకాల ఉద్యమం సాగుతున్న మాట నిజమేనని ముఖ్యమంత్రి నిజలింగప్పగారుకూడా ఒప్పుకున్నారు. ఆ వర్గంవారు తననుంచీ, తన మంత్రివర్గంనుంచీ ఏంకోరుతున్నారో తెలియదుకాని ఈ ఉద్యమంమాత్రం నిజంగా దురదృష్టకరమైందని ఆయన అన్నారు.

తనకేనాడూ పదవీకాంక్ష లేదనీ, అంతా కావాలంటేనే పదవిని స్వీకరించాననీ వద్దంటే విడిచిపెడతాననీ ఆయన అన్నారు.

ఏమిటి మీరు వేదాంత ధోరణిలో పడ్డారే అని పత్రికలవారు ప్రశ్నించగా, ఆయన ఇలా అన్నారు: వేదాంతం ఏముంది. నే నెంత నా వ్యక్తిత్వం ఎంత. నే నెక్కడున్నా వ్యక్తిగతంగా నా కున్న ప్రాధాన్యం ఏమిటి? మనమంతా కలిసి దేశశ్రేయస్సుకు పాటుపడాలి. ఎక్కడున్నప్పటికీ ఆ పని చేయగలుగుతాం.

ప్రశ్న : అయితే,ఏంచేయదలుచుకొన్నారు.

జ : ఓపికపట్టి చూడండి.

కొత్త పారిశ్రామిక కేంద్రాలు

న్యూఢిల్లీ, మార్చి 16

చిన్న పరిశ్రమలకు తగు భవన సౌకర్యాలూ వగైరాలు కల్పించడం కోసం దేశంలో మరొక 8 పారిశ్రామిక కేంద్రాల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. వీటితో ఇప్పటికి 59 పారిశ్రామిక కేంద్రాలను కేంద్రం మంజూరు చేసింది.

ఈ మొత్తం 59 లోనూ 8 కమ్యూనిటీ డెవలప్‌మెంటు బ్లాకులలోనూ 9 పైలట్ ప్రాజెక్టు ప్రాంతాలలోనూ వుంటాయి. దాదాపు డజను కేంద్రాలు పని ప్రారంభించాయి.

ఇప్పుడు మంజూరు చేసిన 8 కేంద్రాలూ బొంబాయిరాష్ట్రంలో రెండు, రాజస్థాన్‌లోఒకటి, కేరళలో ఒకటి, బీహార్‌లో ఒకటి వుంటాయి. ఈ 8 కేంద్రాలకు 6 లక్షల 66 వేలు మంజూరు చేశారు.

ఆరోగ్య పథకాలు

త్వరగా అమలుజరిపేందుకు దళాల సంచారం

న్యూఢిల్లీ, మార్చి 16

రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించిన అనేక పథకాలు, యితర కార్యక్రమాలు త్వరితగతిని అమలు జరిగేందుకై, కేంద్ర ఆరోగ్యశాఖలోని అధికారులు చిన్న చిన్న దళాలుగా ఏర్పడి వివిధరాష్ట్రాల్లో పర్యటిస్తారని కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ నిన్న యిక్కడ జరిగిన వైద్య విద్యా మహాసభలో చెప్పారు.

ఈ దళాలు ఆరునెలల కొకసారి ప్రతిరాష్ట్రంలోను పర్యటన జరుపుతాయి. తమ పర్యటన సందర్భంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో వివిధ పథకాల్లో సాధించిన అభివృద్ధిని గూర్చి, వీటిని అమలు పర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాల్ని ఎదుర్కొంటున్న కష్టాల్ని గూర్చి చర్చిస్తారు ఈ కష్టాల్ని సాధ్యమైనంత వరకు తగ్గించటానికి తగు సూచనలు చేస్తారు.

ఆదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో కూడా కొన్ని దళాలు ప్రతి ఆరునెలలకు ఢిల్లీ వెళ్ళి కేంద్ర ఆరోగ్యశాఖతో విషయాల్ని చర్చిస్తారు.

షేక్ అబ్దుల్లా చర్యలు

జాతీయ మహాసభ ఖండన

జమ్మూ, మార్చి 16

కాశ్మీరు రాజ్యాంగం చెల్లనేరదంటూ కాశ్మీరు మాజీ ప్రధాని షేక్ అబ్దుల్లా ప్రారంభించిన ఉద్యమం అరాచకానికి, అల్లకల్లోలాలకు దారితీస్తుందని హెచ్చరిస్తూ కాశ్మీరు జాతీయ మహాసభ 21 వ వార్షిక సమావేశంలో నేడు తీర్మానించారు. ఆ తీర్మానంలో ఇలాపేర్కొన్నారు:

కాశ్మీరు రాజ్యాంగం చెల్లనేరదని షేక్ అబ్దుల్లా ఎలా అనగలుగుతున్నారో దురూహ్యం. రాజ్యాంగం అంటూ లేకుండా ప్రపంచంలోని ఏదేశమూ, ఏప్రాంతమూ ఒక్కక్షణం పాటుకూడా మనజాలదన్న సంగతి ఆయనకు తెలియనిదా? రాజ్యాంగం చెల్లనేరదనటం అరాచకాన్ని, అల్లకల్లోలాలను ఆహ్వానించటమే కాగలదు.

భారతదేశంలో కాశ్మీరు విలీనమైపోయింది, దానిని మళ్ళీ తిరగదోడాలని ఎవరైనా ప్రయత్నిస్తే, అది అంతర్జాతీయ సంఘర్షణకు దారితీస్తుంది.

కాశ్మీరులో పాకిస్తాన్ జరిపిన దురాక్రమణకు స్వస్తి చెప్పటమొక్కటే నేటివరకు మిగిలివున్న ఏకైకసమస్య. పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకొన్న కాశ్మీరు ప్రాంతం నుంచి వైదొలగితే, కాశ్మీరు సమస్య తేలికగా పరిష్కారమై పోతుంది.

కాశ్మీరును మతప్రాతిపదికపై విభజించాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరమని ఈ తీర్మానంలో హెచ్చరించారు.

ఈ తీర్మానాన్ని కాశ్మీరు ప్రధాని బక్షీ గులాంమహమ్మద్ బలపర్చారు.

షేక్ అబ్దుల్లా తన వైఖరి మార్చుకుంటే?

తిరిగి ప్రధాని పదవి యివ్వగలమని బక్షీ ప్రకటన

జమ్మూ, మార్చి 16

భారతదేశంలో కాశ్మీరు విలీనీకరణ సూత్రాన్ని షేక్ అబ్దుల్లా అంగీకరించిన పక్షంలో, ప్రధానమంత్రి పదవి నుంచి తాను వైదొలగి, ఆ పదవిని తిరిగి ఆయనకు ఒసగటానికి తన కెట్టి అభ్యంతరం లేదని కాశ్మీరు ప్రధాని బక్షీ గులాం మహ్మద్ నేడిక్కడ కాశ్మీరు జాతీయ మహాసభ 21 వ వార్షిక సమావేశంలో ప్రసంగిస్తూ ప్రకటించారు.

దక్షిణాఫ్రికాలో సార్వజనీన సమ్మెకు సన్నాహాలు

ఏప్రిల్ 14 వ తేదీనుంచి సమ్మె ప్రారంభించాలనికార్మికమహాసభ నిర్ణయం

జోహాన్నెస్‌బర్గ్, మార్చి 16

దక్షిణాఫ్రికాలో ఏప్రిల్ 16 వ తేదీనుంచి సార్వజనీన సమ్మె ప్రారంభించాలని ఆఫ్రికా కార్మిక జాతీయ మహాసభ నేడు నిర్ణయించింది.

దక్షిణాఫ్రికాలో ఏప్రిల్ 14 వ తేదీన జనరల్ ఎన్నికలు జరుగుతున్నాయి.ప్రజలకోర్కెలసాధనకు ఆనాటినుంచి కార్మికులంతా తమతమ యిళ్ళల్లోనే వుండిపోతూ, సహాయ నిరాకరణోద్యమం సాగించాలని కార్మిక మహాసభ పిలుపు యిచ్చింది.

ఆఫ్రికా కార్మిక జాతీయ మహాసభలో 2 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.వారిలో హెచ్చుభాగం ఆఫ్రికన్లు.

ఆఫ్రికా జాతీయ కాంగ్రెసు, దక్షిణాఫ్రికా భారతీయ కాంగ్రెసు, దక్షిణాఫ్రికా రంగుజాతుల మహాసభ, దక్షిణాఫ్రికా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు, దక్షిణాఫ్రికా ప్రజాస్వామిక కాంగ్రెసు మున్నగు ప్రజాసంస్థలు ఈ సహాయ నిరాకరణోద్యమాన్ని బలపరుస్తున్నాయి.

నేషనలిస్టుపార్టీ పరిపాలనను తుదముట్టించాలనీ, జాతివిచక్షణ చూపే చట్టాలన్నిటినీ రద్దుచేయాలనీ అధిక వేతనాలు ఒసగాలనీ, రోజుకు కనీస వేతనం ఒక పౌనుగా నిర్ణయించి, దానిని చట్టంగా చేయాలనీ కార్మికులు కోరుతున్నారు.

ప్రజల కోర్కెలన్నిటినీ తీర్చేవరకు కార్మికులు ఈ సహాయ నిరాకరణోద్యమాన్ని సాగించాలని కార్మిక జాతీయ మహాసభ తీర్మానంలో వివరించారు.

సమ్మె అన్న పదాన్ని ఉపయోగించటం దక్షిణాఫ్రికాలో నేరం కనుక, ఆమాటకు బదులు కార్మికులంతా యిళ్ళల్లోనే వుండిపోవాలని కార్మిక మహాసభ తీర్మానంలో పేర్కొన్నారు.

దక్షిణాఫ్రికాలో రంగుజాతుల వారికి ఓటింగుహక్కు లేదు. తెల్లవారికి మాత్రమే ఓటుహక్కు వుంది. కనుక ఎన్నికలుజరిగే వారంరోజులూ కార్మికులు ప్రత్యక్ష కార్యాచరణ ప్రారంభించాలనీ, బహిరంగ సభలు, ఊరేగింపులు, కాగడాల ప్రదర్శనలు, డెప్యుటేషన్లు మున్నగు వాటిని జరపాలనీ కార్మిక జాతీయ మహాసభ ఆదేశించింది.

ఆంధ్రలో కేరళ ప్రభుత్వపు బియ్యంకొనుగోలుపై దర్యాప్తు

రాష్ట్రశాసనసభలో నంబూద్రిపాద్ ప్రకటన

తిరువనంతపురం, మార్చి 17

ఆంధ్రలో కేరళ ప్రభుత్వం ఖరీదు చేసిన బియ్యం కొనుగోలు విషయమై న్యాయవిచారణ జరిపేందుకు తన ప్రభుత్వం నిశ్చయించిందని ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ నేడు రాష్ట్రశాసనసభలో ప్రకటించారు.

ఈ దర్యాప్తు జరిపేందుకు ఎవరిని నియమించాలన్న విషయంపై రాష్ట్రప్రభుత్వం హైకోర్టు న్యాయమూర్తులతో సంప్రతిస్తున్నదనికూడా ఆయన తెలిపారు.

కమ్యూనిస్టు ప్రభుత్వంపై ప్రతిపక్షాలవారు ఆధారరహితమైన ఆరోపణలు చేస్తున్నారు. ఆంధ్రలో బియ్యం కొనుగోలుపై జరుగుతున్న దుష్ప్రచారం కూడా ఈ ఆరోపణలలో ఒక భాగమే. న్యాయవిచారణ సంఘాలను ప్రతిపక్షాలవారు తమ ఆరోపణలను ఏమాత్రం రుజువుచేయగలరో రాష్ట్ర ప్రజలు త్వరలో తెలుసుకోగలరని శ్రీ నంబూద్రిపాద్ చెప్పారు.

కేరళ బడ్జెట్‌లోని పరిపాలన వ్యయం పద్దుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ శ్రీ నంబూద్రిపాద్ ఈ విషయం ప్రకటించారు.

ప్రజాసోషలిస్టు పార్టీ నాయకుడు శ్రీ పట్టం థానుపిళ్ళై ప్రతిపాదించిన కోతతీర్మానాన్ని త్రోసివేసినపిమ్మట, శాసనసభ ఈ పద్దును ఆమోదించింది.

కోత తీర్మానానికి వ్యతిరేకంగా 63 ఓట్లు, అనుకూలంగా 57 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర సభ్యుడు ఉమేష్‌రావు, నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ సభ్యుడు కోతతీర్మానానికి అనుకూలంగా ఓటు చేశారు.

కాశ్మీరులో పాక్ దురాక్రమణ

అఖిలభారత షియా సదస్సు విమర్శ

న్యూఢిల్లీ, మార్చి 16

కాశ్మీరుపైపాకిస్తాన్ దురాక్రమణ జరిపి, అక్రమంగా ఆక్రమించుకొన్న ప్రాంతం నుంచి పాక్ సైనికబలాలను ఉపసంహరించవలసిందిగా ఐరాస పాకిస్తాన్‌ను ఆదేశించాలని నేడిక్కడ సమావేశమైన షియాముస్లిం తెగ ప్రతినిధులు తీర్మానించారు.

అఖిలభారత షియా సదస్సులో భారతదేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన షుమారు 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

కాశ్మీరు మాజీ ప్రధాని షేక్ అబ్దుల్లా చర్యలను కూడా ఆ తీర్మానంలో నిశితంగా విమర్శించారు.

పబ్లిక్ రంగంలో నూనెశుద్ధి కర్మాగారాలు

వ్యతిరేకుల యత్నాలు

న్యూఢిల్లీ, మార్చి 16

భారతదేశంలో నూనెశుద్ధి కర్మాగారాలను స్థాపించుటంలో తాను తోడ్పడగలనని రుమేనియా, సోవియట్ యూనియన్ దేశాలు వాగ్దానం చేసిన ఫలితంగా బర్మాషెల్ కంపెనీ కూడా నూనెశుద్ధికర్మాగారస్థాపనలో తోడ్పడటానికి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

సోషలిస్టు దేశాల సహాయంతో పబ్లిక్‌రంగంలో రెండు నూనె శుద్ధి కర్మాగారాలు స్థాపించబడితే, అప్పుడు నూనె ధరలను కేంద్ర ప్రభుత్వం సునాయాసంగా అదుపాజ్ఞలలో పెట్టగల్గిన స్థితిలో వుంటుంది.

అందుచేత యీ విషయంలో సోషలిస్టు దేశాలు వాగ్దానం చేసిన సహాయం పశ్చిమ దేశాల నూనె కంపెనీలకు కంటకప్రాయంగా తయారయింది.

అందుచేత ఏ విధంగానైనాసరే పబ్లిక్ రంగంలో నూనె శుద్ధి కర్మాగారాలు ఏర్పడనీయకుండా నివారించాలని విదేశ నూనెకంపెనీలు, భారతదేశంలోని పశ్చిమ రాజ్యాల అనుకూలురు ప్రయత్నం చేయగలరని ఎంచబడుతుంది. (ఐ. పి. ఏ.)

రిపబ్లికన్ విద్యార్థి ఫెడరేషన్ సదస్సు

రామచంద్రపురం, మార్చి 14

రామచంద్రపురం తాలూకా రిపబ్లికన్ విద్యార్థి ఫెడరేషన్ సదస్సు ఇటీవల తూర్పు గోదావరిజిల్లా రిపబ్లికన్ విద్యార్థి ఫెడరేషను ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. వి. సూర్యనారాయణమూర్తిగారి అధ్యక్షతను జరిగింది.

అధ్యక్షులు మాట్లాడుతూ కులమత ప్రమేయంలేని నవవిద్యార్థి ఉద్యమాన్ని నెలకొల్పి విద్యార్థులను సమీకరించటమే రిపబ్లికన్ విద్యార్థి ఫెడరేషన్ ఆశయమన్నారు. సమాజంలోగల అభివృద్ధినిరోధక శక్తులకు లొంగిపోకూడదని విద్యార్థులను హెచ్చరించారు. "విద్యార్థి కాంగ్రెసు" పార్టీ తోకసంస్థగా పని చేస్తూవున్నదని చెప్పారు. విద్యాలయాలలో అస్పృశ్యత తాండవిస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోవడం లేదనివిమర్శించారు. హరిజనసంఘ సేవకులు ప్రభుత్వం కేటాయించినధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. దానిని రద్దుచేసి నిమ్నజాతుల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అర్థించారు.

తరువాత శ్రీ ఈలి వాడపల్లిగారు ఉపన్యసించారు.

ఎరువుల ఉత్పత్తి వ్యయం తగ్గింపు

సోవియట్ రాయబారి ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 14

ఎరువుల ఉత్పత్తి వ్యయాన్ని సగానికి సగం తగ్గించే అవకాశం కలదనీ, అందుకు సంబంధించిన వివరాలన్నింటినీ తాము భారతప్రభుత్వానికి అందచేయగలమనీ సోవియట్ రాయబారి పొనమరెంకో గత వారంలో ఢిల్లీలో జరిగిన భారత – సోవియట్ మిత్రమండలి వారు ఏర్పాటుచేసిన విందు సందర్భంలో ప్రసంగిస్తూ చెప్పారు, (ఐ. పి. ఏ.)

కాశ్మీరు విషయంలో భారత ప్రభుత్వం అవలంబించిన వైఖరి లౌకిక రాజ్యాంగ సూత్రాలకు పూర్తిగా అనుగుణంగా వున్నదని రక్షణమంత్రి కృష్ణమీనన్ జమ్మూలో ఒక సభలో ప్రసంగిస్తూ అన్నారు.

1957-58 లో ఆహారపంటల ఉత్పత్తి

న్యూఢిల్లీ, మార్చి 16

భారతదేశంలో 1956-57 సంవత్సరంలో పంటలు బాగా పండాయనీ, అయితే 1957 - 58 సంవత్సరంలో వర్షాభావంవల్ల పంటలు బాగా దెబ్బతిన్నవనీ కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖవారు ప్రకటించిన నివేదికలో పేర్కొన్నారు.

చెరకు, నూనె గింజలు ఉత్పత్తి 1956-57 సంవత్సరంకన్నా 1957-58 సంవత్సరంలో పెరిగేఅవకాశంవుంది.

1955-56 లో వ్యవసాయవుత్పత్తి సూచిక 115.9 కాగా (1949-50 లో 100 అనుకుంటే) 1956-57 లో అది 123 కు పెరిగింది. అంటే ఆ సంవత్సరము వ్యవసాయోత్పత్తి సుమారుగా 6 శాతం హెచ్చింది.

1954 - 58 లో ఉత్తరప్రదేశ్, బీహారు, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలలో వర్షాభావంవల్ల పంటలు బాగా దెబ్బతిన్నాయి.

తిండిగింజల ఉత్పత్తి తగ్గినప్పటికీ, వాణిజ్యపంటల ఉత్పత్తి బాగా వున్నట్లు ఇప్పటివరకు అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తోంది.

రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో వ్యవసాయోత్పత్తి సాలీనా 5.4 శాతం చొప్పున పెంచాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు.

1957-58 సంవత్సరంలో అధికోత్పత్తి పథకాలు అమలు జరిపేందుకు కేంద్రం 25.97 కోట్ల రూపాయలను రాష్ట్రప్రభుత్వాలకు మంజూరు చేసింది.

1957-58 సంవత్సరంలో మైనర్ ఇరిగేషన్, తదితర చిన్నచిన్న పథకాలు అమలుజరిపినందువల్ల 22 లక్షల ఎకరాల భూమి అదనంగా సాగులోకి వచ్చినట్లు అంచనా వేయబడుతున్నదని ఈ నివేదికలో పేర్కొన్నారు.

గవర్నరు పదవి నిర్వహించినవారు తిరిగి ఏ వుద్యోగం చేయకూడదనే ఒక అనధికార తీర్మానాన్ని లోక్‌సభ ఈ నెలాఖరుకు చర్చిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు -
హైదరాబాదు
CMP. 3381 OF 1957
A. S. 183/52
COS. 84/50 గుంటూరు సబ్‌కోర్టు
యెండూరి రాఘవయ్య– అప్పిలెంటు.
and
మెహబున్నీసా బేగం చనిపోయినందున వారసులు.

1. మహ్మదు అజంతుల్లాఖాన్
2. సాదతున్నీసాబేగం
3. అజమున్నీసాబేగం
4. మహ్మదున్నీసాబేగం

రెస్పాండెంట్లు

పైఅప్పీలులో మెహబున్నీసాబేగం చనిపోయినందున వారసులు అయిన 1,2,3,4 ప్రతివాదులను వారసులుగా చేర్పించుటకు వాది పిటీషను పెట్టియున్నాడు. అందుకుగాను ది 18-3-58 వ తేదీలోగా వాయిదా వేసియున్నారు. ఆ తేదీన పై నలుగురు రిజిస్ట్రారుగారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేని ఎడల హైకోర్టువారిచే ఎక్స్‌పార్టీ పాస్ చేయబడునని యిందుమూలముగా తెలియ జేయడమైనది.

(సం) కామరాజు కృష్ణమూర్తి,
అప్పిలెంటు అడ్వొకేట్,
హైద్రాబాద్, 17-3-58.

TRADE MARK CAUTION
Trade Marks Act, 1940.

Notice is hereby given that the following Trade Mark is registered in favour of my clients Messrs. J. Khushaldas & Co., 77-79, Nagdevi Street, Bombay-3 under No. 175106 in respect of Rice Hullers and parts thereof in class under the Trade Marks Act 1940.

Redmark

Any person who tries to imitate or imitates the aforesaid trade mark in any manner whatsoever either visually or phonetically will be dealt with according to law both Civil and criminal.

FATEHCHAND C. SHAW,
Advocate for Messrs
J. Khushaldas & Co.
22-2-58.
'A' Aidun Building,
1st Dhobitalao Lane,
Bombay-2.

సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షుడు); కాట్రగడ్డ రాజగోపాలరావు,ఏటుకూరి బలరామమూర్తి - ఎడిటర్, & ప్రింటర్ పబ్లిషర్: విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున కాట్రగడ్డ రాజగోపాలరావు,స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ - 2.